కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ : సోమవారం 23 సెప్టెంబర్ 2024

సంపుటి: 14, సంచిక: 172, పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


## జగన్ ఇంటి ముందు
# జై శ్రీరామ్ నినాదాలు



**అమరావతి సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** తిరుమల శ్రీవారికి నివేదించిన తర్వాత తీసుకునే లడ్డూ ప్రసాదాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు భక్తులు. అలాంటి ప్రసాదం కల్తీ అయిందన్న వ్యవహారం ఏపీనే కాదు, యావత్ దేశాన్ని కుదిపేస్తోంది. దీనిపై ఏపీలో

..మిగతా 2లో

## తనపై గెలవాలంటే...
## నిజాయితీపై
# దాడి చేయాలి

నన్ను అవినీతిపరుడిగా నిరూపించేందుకు మోదీ కుట్రలు: కేజ్రీవాల్



2

# రాజకీయ సన్యాసం తీసుకుంటా

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

### డేట్ టైం ఫిక్స్ చేయండి సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ దగ్గరికి వెళ్దాం

- అమృత్ టెండర్ల ఆరోపణలపై పొంగులేటి సవాల్‌ను స్వీకరిస్తున్నాను
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్
- అమృత్ టెండర్లలో తప్పు జరగలేదని నిరూపించండి
- అమృత్ టెండర్లను ఇప్పటికైనా రద్దు చేయండి
- 2022-23లో సింగరేణి లాభాల్లో కార్మికులకు 32 శాతం వాటా ఇచ్చాం
- ఒక్కో కార్మికుడికి రూ.3.7 లక్షలు రావాలి కానీ లక్షా 90 వేలు మాత్రమే ఇస్తున్నరు
- కాంగ్రెస్ కుట్రపూరిత వైఖరిపై సీపీఐ సమాధానం చెప్పాలి: కేటీఆర్



**హైదరాబాద్ సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** అమృత్ టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి సవాల్‌ను స్వీకరిస్తున్నానని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నిన్న ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్ ఇచ్చారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇద్దరం కలిసి హైకోర్టు సీజే దగ్గరకి పోదాం.వెంటనే సిట్టింగ్ జడ్జితోని ఎంక్వయిరీ చేయిద్దాం. సిట్టింగ్ జడ్జి గనుక ఇందులో తప్పులు ఎం జరగలేదు అంటే, తాను రాజకీయ సన్యాసం చేస్తా. హైకోర్టు సీజే దగ్గరికి రాడానికి మంత్రికి ఇబ్బంది ఉంది అంటే డేట్, టైం ఫిక్స్ చేయండి ఇద్దరం కలిసి కేంద్రంలో ఉండే సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ దగ్గరికి పోదాం. మంత్రికి, ముఖ్యమంత్రికి ఒకటే చెప్తున్నానని ఇప్పటికైనా టెండర్లు రద్దు చేయాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి అద్భుత ప్రగతి సాధించిందని కేటీఆర్ అన్నారు. పదేండ్లలో సింగరేణి లాభాలు గణనీయంగా పెరిగాయన్నారు. లాభాల్లో కార్మికుల వాటా పెంచుకుంటూ వచ్చామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో పది పైసల వాటా మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ పాలన ఉన్న ఐదేండ్లలో 10 పైసల వాటా మాత్రమే ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో

..మిగతా 2లో



# గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చిరంజీవి

## అభినందనలు తెలిపిన చంద్రబాబు, రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** మెగాస్టార్ చిరంజీవి తన 45 ఏళ్ల కెరీర్‌లో 24 వేల డాన్స్ మూవ్‌మెంట్స్ చేసినందుకు ఆయనకు గిన్నిస్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు అమిర్‌ఖాన్ చేతుల మీదుగా ఈ అవార్డును మెగాస్టార్ అందుకున్నారు. చిరంజీకి ఈ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి తన 45 ఏళ్ల సినీ ప్రస్థానంలో 156 సినిమాల్లో 537 పాటల్లో దాదాపు 24 వేలకు పైగా వివిధ డాన్స్ మూవ్‌మెంట్స్ చేశారు. ఇందుకు గానూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆయనకు చోటు దక్కింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో.. అమిర్‌ఖాన్ చేతుల మీదగా గిన్నిస్ బుక్ ప్రతినిధులు మెగాస్టార్ చిరంజీవికి ఈ రికార్డును అందించారు. చిన్ననాటి నుంచి తనకు డ్యాన్స్ అంటే ఎంతో ఇష్టమన్న చిరంజీవి.. చిన్నతనంలో రేడియోలో పాటలు వింటూ

..మిగతా 2లో

## శ్రీలంక కొత్త అధ్యక్షుడిగా
# అనుర కుమార



### ఎన్నికల్లో ఘన విజయం
### నేడు ప్రమాణ స్వీకారం

**శ్రీలంక సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో అనుర కుమార దిసానాయకే (55) విజయం సాధించారు. ఆయన శ్రీలంక అధ్యక్ష పదవిని అధిరోహించబోతున్నారు. మార్క్సిస్ట్ నేతగా, జనతా

..మిగతా 2లో

# క్వాడ్ ఎవరికీ వ్యతిరేకం కాదు: మోదీ



## క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న ప్రధాని మోదీ

### అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో చర్చలు ఫలించాయి

**న్యూయార్క్ సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** క్వాడ్ ఎవరికీ వ్యతిరేకం కాదనీ, ఇది అంతర్జాతీయ భద్రత, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ అన్నారు. దక్షిణ, తూర్పు చైనా సముద్రంలో వివాదాలలో నిమగ్నమై ఉన్న చైనాపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. అమెరికాలోని డెలావేర్‌లో జరుగుతున్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచాన్ని ఉద్రిక్తతలు, సంఘర్షణలు చుట్టుముట్టిన సమయంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. అలాంటి పరిస్థితిలో భాగస్వామ్య ప్రజాస్వామ్య విలువల ఆధారంగా క్వాడ్‌తో కలిసి పనిచేయడం మొత్తం మానవాళికి చాలా ముఖ్యమని చెప్పారు. 2021లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అధ్యక్షతన జరిగిన తొలి క్వాడ్ సదస్సును ప్రధాని గుర్తుచేసుకున్నారు. చాలా తక్కువ సమయంలో క్వాడ్ దేశాలు సహకారాన్ని ప్రతి దిశలో విస్తరించాయని చెప్పారు. 2025లో ఈ

..మిగతా 2లో

# కబ్జా కనపడితే కూల్చుడే!

### దూకుడు పెంచిన హైడ్రా
### కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేత

**హైదరాబాద్ సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** అక్రమ నిర్మాణాలపై నాన్‌స్టాప్‌గా దూసుకెళ్తోంది హైదరాబాద్ డిసాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ అలియాస్ హైడ్రా. హైదరాబాద్‌లో ఆడా,ఈడా అనే తేడా లేకుండా ఎక్కడ కబ్జా కనిపించినా హై స్పీడుతో కదంతొక్కుతున్న హైడ్రా, తాజాగా మరోసారి జూలు విదిల్చింది. హైడ్రా ఆదేశాలతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పలు ఏరియాల్లో కూల్చివేతలు చేపట్టారు. కూకట్‌పల్లి, అమీన్‌పూర్ ఏరియాల్లో కూల్చివేతలు కూకట్‌పల్లి, అమీన్‌పూర్ ఏరియాల్లో కబ్జానిర్మాణాలపై ఫోకస్ పెట్టింది హైడ్రా. కూకట్‌పల్లి నల్లచెరువులోని 66, 67, 68, 69 సర్వే నెంబర్లలో అనుమతులు లేకుండా నిర్మించిన 16 షెడ్లను కూల్చేసింది. ఇప్పటికే ఆయా నిర్మాణాల యజమానులకు నోటీసులు ఇచ్చిన హైడ్రా ఉదయాన్నే బుల్డోజర్స్, ప్రొక్లెయినర్స్‌తో సహా స్పాట్‌కు చేరుకుంది. చెరువును

..మిగతా 2లో



# తిరుమలను అపవిత్రం చేశారు

## టీటీడీ ఛైర్మన్‌గా చేసిన వైవీ సుబ్బారెడ్డి భార్య బైబిల్ పట్టుకుని తిరుగుతుంది

### మరో మాజీ ఛైర్మన్ భూమన తన ఇంట్లో పెళ్లిని క్రిస్టియన్ పద్ధతిలో చేశారు

### వీఐపీ టిక్కెట్లు అమ్ముకున్నారు: చంద్రబాబు

**ఉండవల్లి సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** ప్రపంచ వ్యాప్తంగా తిరుమలకు ఎంతో విశిష్టత ఉందని, ఇప్పటి వరకూ పాలకులెవ్వరూ దాని పవిత్రత దెబ్బతీసే సాహసం చేయలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం తిరుమల వేంకటేశ్వరస్వామిని కూడా వదల్లేదని ధ్వజమెత్తారు. ఎందరికో స్ఫూర్తిదాయకమైన పవిత్ర క్షేత్రంలో గత 5 ఏళ్లుగా అపవిత్ర కార్యక్రమాలు చేపట్టారని ధ్వజమెత్తారు. రాజకీయ పునరావాస కేంద్రంగా తిరుమలను మార్చారని దుయ్యబట్టారు. ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. స్వామి వారు అందరి అకౌంట్లు సెటిల్ చేస్తారు. రాజకీయ పునరావాస కేంద్రంగా తిరుమలను మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజశేఖర్ రెడ్డి 7 కొండల్ని 2 కొండలు అంటేనే ఎంతో పోరాటం చేశామని గుర్తుచేశారు. తనకు వ్యక్తిగతంగానూ తిరుమల శ్రీవారంటే చిన్నప్పటి నుంచీ ఎంతో నమ్మకమని చెప్పారు. అలిపిరి

..మిగతా 2లో





# కల్తీ నెయ్యిపై ప్రధానికి వైఎస్ జగన్ లేఖ

**అమరావతి సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** వంద రోజుల పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సున్నితమైన తిరుమల లడ్డూ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు తెరపైకి తీసుకొచ్చారని వైఎస్సార్సీపీ అధినేత జగన్ ఆరోపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ తయారీపై సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణల్లో నిజానిజాలు వెలికి తీయాలని ప్రధాని మోదీని కోరారు. ఈ వ్యవహారాన్ని జాగ్రత్తగా చూడక పోతే పరిస్థితులు దిగజారే ప్రమాదం ఉందన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూను కల్తీ చేశారన్న సీఎం చంద్రబాబు ఆరోపణలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి జగన్ సుదీర్ఘ లేఖ రాశారు. ప్రజల దృష్టిని మరల్చడానికి పచ్చి అబద్ధాలను ప్రచారం చేశారని, దీంట్లో భాగంగానే తిరుమల లడ్డూ తయారీలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని ఆరోపణలు చేశారని తెలిపారు. రాజకీయ ఉద్దేశాలను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు ఈ ప్రచారం చేశారన్నారు. నెయ్యిని ఆలయానికి పంపే ముందు దాని స్వచ్ఛత, నాణ్యతలపై నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్, కాలిబ్రేషన్ ల్యాబరేటరీస్ ద్వారా గుర్తింపు పొందిన


..మిగతా 2లో



## మత కార్యక్రమాలను కలుషితం చేస్తున్న
# డీజేలు

### డీజేను శాశ్వతంగా బ్యాన్ చేయాలి
### మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

2



2

## గాజాలోని పాఠశాలపై
# ఇజ్రాయెల్ దాడి

### మృతి చెందిన వారిలో హమాస్ పబ్లిక్ వర్క్స్ అండ్ హౌసింగ్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మజీద్ సలీహ్

## పాకిస్తాన్‌తో
# చర్చల ప్రసక్తే లేదు

### ఆర్టికల్ 370 పునరుద్ధరణ ఏ శక్తివల్లా సాధ్యం కాదు
### ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలపై అమిత్ షా ఫైర్



**కాశ్మీర్ సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే తొలి విడత పోలింగ్ పూర్తయింది. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ, కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ సహా ఇతర పార్టీలు విశ్వ ప్రయత్నాలు

..మిగతా 2లో





## కబ్జా కనపడితే కూల్చుడే!

**మొదటి పేజీ తరువాయి...**

కబ్జా చేసి కట్టిన మొత్తం 16 కమర్షియల్ షెడ్లు, ప్రహారీ గోడలను కూల్చివేసింది. కూకట్‌పల్లి నల్లచెరువు పరిధిలో 4 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకుంది హైడ్రా. కిష్టారెడ్డిపేటలో మూడు భవనాలు కూల్చిన హైడ్రా సంగారెడ్డి జిల్లాకు, హైదరాబాద్‌కు వారధిలా ఉండే అమీన్‌పూర్ మున్సిపాలిటీలోనూ కూల్చివేతలు చేపట్టింది హైడ్రా. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పేటలో సర్వే నెంబర్ 164లో మూడు భవనాలు కూల్చివేసింది. అవి మూడూ భారీ బహుళ అంతస్తు భవనాలే కావడం విశేషం. వాణిజ్య పరంగా వాడుతున్న ఐదు అంతస్తుల భవనాన్ని నేలమట్టం చేసింది. అక్కడ కబ్జాచేసిన ఎకరం ప్రభుత్వం స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. అయితే నివాస గృహాలను కూల్చలేదనీ కేవలం కమర్షియల్ భవనాలనే కూల్చేశామనీ చెప్పారు. 12/2, 12/3 సర్వేనెంబర్‌లోని 25 నిర్మాణాల కూల్చివేత పటేల్ గూడలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలన్నీ తొలిగించారు. సర్వే నెం.12/2, 12/3లోని 25 నిర్మాణాల కూల్చివేశారు. పటేల్ గూడలో 3ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. మొత్తం మూడు ప్రాంతాల్లో దాదాపు 8 ఎకరాలు ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా కమిషనర్ తెలిపారు. రెవెన్యూ, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్ తో కలిసి కూల్చివేతలు చేపట్టామన్నారు. నీటి వనరుల సంరక్షణ కోసం సంయుక్తంగా కృషి చేస్తున్నామనీ చెప్పారు రంగనాథ్. దూకుడుగా ముందుకెళ్తున్న హైడ్రా తదుపరి టార్గెట్ ఏ ఏరియా అన్నదే ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

## తనపై గెలవాలంటే... నిజాయితీపై దాడి చేయాలి

**నన్ను అవినీతిపరుడిగా నిరూపించేందుకు మోదీ కుట్రలు: కేజ్రీవాల్**

**న్యూఢిల్లీ సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** తనను అవినీతి పరుడిగా నిరూపించేందుకు ప్రధాని మోదీ కుట్ర పన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని మోదీ భావించారంటూ మండిపడ్డారు. ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన 'జనతాకీ అదాలత్' కార్యక్రమంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. 'ప్రధాని నరేంద్ర మోదీ మాపై కుట్ర పన్నారు. నన్ను, (ఆప్ నేత) మనీష్ సిసోడియా అవినీతిపరుడని నిరూపించేందుకు కుట్ర పన్నారు. మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించారు' అని అన్నారు. కాగా, తాను గత పదేళ్లుగా నిజాయితీతో ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపానని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని ప్రధాని మోదీ భావించారని విమర్శించారు. 'సీఎం కుర్చీపై ఆకలి లేకపోవడం వల్లే రాజీనామా చేశా. డబ్బు సంపాదించడానికి కాదు, దేశ రాజకీయాలను మార్చేందుకే వచ్చా అని అన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసిన తాను మరికొద్ది రోజుల్లో సీఎం అధికార నివాసం నుంచి వెళ్లిపోతానని తెలిపారు. పదేళ్లపాటు సీఎంగా ఉండి కూడా ఢిల్లీలో తనకు సొంత ఇల్లు లేదన్నారు. మరోవైపు బీజేపీ తనను అవినీతిపరుడని అనడంతో బాధపడ్డానని కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 'అరవింద్ కేజ్రీవాల్ నిజాయితీ లేనివాడైతే ప్రజలకు ఉచిత విద్యుత్తు, మహిళలకు బస్సు చార్జీలు ఉచితంగా ఇచ్చేవాడా పిల్లల కోసం స్కూళ్లు కట్టించేవాడా ఆసుపత్రుల్లో వైద్యం ఉచితంగా అందించేవాడా అని ప్రశ్నించారు. 22 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందని, వారు ఏ రాష్ట్రంలోనైనా ఉచిత విద్యుత్తు లేదా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారా అని నిలదీశారు. 'నేను దొంగనా, లేదా కేజ్రీవాల్‌ను జైలుకు పంపిన వ్యక్తులు దొంగలా అని ప్రశ్నించారు.



## శ్రీలంక కొత్త అధ్యక్షుడిగా అనుర కుమార

**మొదటి పేజీ తరువాయి...**

విముక్తి పెరమున పార్టీకి చెందిన అనుర కుమార రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో గెలుపొందారు. 2022 ఆర్థిక మాంద్యం తర్వాత జరుగుతున్న తొలి అధ్యక్ష ఎన్నికలు ఇవే. శ్రీలంక అధ్యక్ష ఎన్నికల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒక అభ్యర్థి విజయం మొదటి రౌండ్‌లో తేలకుండా రెండో రౌండ్‌కి చేరుకోవడం ఇదే తొలిసారి. మొదటి రౌండ్‌లో ఏ అభ్యర్థికి 50 శాతం కన్నా ఎక్కువ ఓట్లు రాక పోవడంతో, రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుకు వెళ్లాల్సి వచ్చింది. శ్రీలంక అధ్యక్ష ఎన్నికలకు శనివారం ఓటింగ్ జరిగింది. వెంటనే కౌంటింగ్ మొదలైంది. ప్రతిపక్ష నేత సాజిత్ ప్రేమదాస రెండో స్థానంలో నిలిచారు. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే మూడో స్థానంలో నిలిచి పోటీ నుంచి నిష్క్రమించారు. 20 ఏళ్లుగా పార్లమెంట్‌లో ఉన్న దిసానాయకేపై శ్రీలంక ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. శ్రీలంకలో రాజకీయంగా ప్రాబల్యం ఉన్న రాజపక్స కుటుంబంపై ప్రజలు పూర్తిగా విశ్వాసాన్ని కోల్పోయారు. శనివారం జరిగిన ఎన్నికల్లో 55 ఏళ్ల దిసానాయకే 42.31 శాతం ఓట్లను సాధించారని, ప్రతిపక్ష నేత సజిత్ ప్రేమదాస రెండో స్థానంలో నిలిచారని శ్రీలంక ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. శ్రీలంకలోని 17 మిలియన్ల అర్హత కలిగిన ఓటర్లలో 75 శాతం మంది పాల్గొన్నారు. శ్రీలంక కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన దిసానాయకే తన విజయం తర్వాత జాతీయ ఐక్యత కోసం పిలుపు నిచ్చారు. సింహళీయులు, తమిళులు, ముస్లింలు, శ్రీలంక ప్రజలందరి ఐక్యతకు ఇది కొత్త ప్రారంభమని అన్నారు.

# తిరుమలను అపవిత్రం చేశారు

**మొదటి పేజీ తరువాయి...**

ఘటనలో తాను ప్రాణాలతో బయటపడటం స్వామి చేసిన అద్భుతమే తప్ప, ఆ బ్లాస్ట్‌లో ప్రాణాలతో బయటపడటం అసాధ్యమన్నారు. స్వామి వారు అందరి అకౌంట్లు ఎప్పటికప్పుడు సెటిల్ చేస్తారని, అది ఆయన మహత్యమని తెలిపారు. గత ఐదేళ్లలో భక్తుల మనోభావాలకు విలువలేదని, వారి సమస్యలు పట్టించుకోలేదని మండిపడ్డారు. తిరుమల లడ్డూ న్యాణ్యత, సువాసనకు ఎంతో విశిష్టత ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. స్వామి మహత్యం ఉంది కాబట్టే ఎంతో మంది లడ్డూని కాపీరైట్ చేయాలనుకున్నా చేయలేకపోయారని, అంతటి విశిష్టత ఉన్న లడ్డూకి వాడే పదార్థాలకు రివర్స్ టెండరింగ్ పెట్టి నాణ్యత దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం వారికి గేట్లు తెరిచినట్లుగా రివర్స్ టెండరింగ్ నిబంధనలు మార్చేశారని మండిపడ్డారు. ఫలితంగా ప్రధాన సంస్థలు ఏవీ టెండర్‌లో పాల్గొనలేక పోయాయన్నారు. వైఎస్సార్సీపీ వచ్చీ రావడంతోనే ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీశారని, ట్రస్టు బోర్డుల నియామకాలు ఓ గ్యాంబ్లింగ్‌గా మార్చేశారని ధ్వజమెత్తారు. ఇష్టానుసారంగా వీఐపీ టిక్కెట్లు అమ్ముకోవడం సహా కొండపై వ్యాపారాలు చేశారని ఆరోపించారు. అన్య మతస్తులను టీటీడీ ఛైర్మన్‌గా వేశారని, రాజకీయ కేంద్రంగా బోర్డుని వాడుకున్నారని దుయ్యబట్టారు. తిరుమల అన్నదానంలో భోజనం చేస్తేనే ఓ ప్రత్యేక అనుభూతి కలిగేలా కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఎన్‌డీడీబీ రిపోర్ట్ ద్వారా ప్రజల మనోభావాలు దెబ్బతింటే, ఎదురుదాడితో తప్పుని కప్పిపుచ్చుకోవాలని చూడటం క్షమించరాని నేరమని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. నివేదిక వాస్తవాలు తాను కప్పిపుచ్చి తారుమారు చేసి బయట పెట్టాలని జగన్ కోరుకుంటున్నాడా అని నిలదీశారు. ఎదురు దాడితో ప్రజలు చేసిన అపచారం మర్చిపోతారనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఆ నివేదిక బయట పెట్టకపోతే ప్రజలకు వాస్తవాలు ఎలా తెలుస్తాయన్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉండాల్సిన లడ్డూ త్వరగా పాడవటం, రంగు మారటం వంటి పరిణామాలు చూశామని చెప్పారు. లడ్డూ రుచి చూసిన వారెవ్వరైనా నాణ్యత లేదని ఇట్టే చెప్పేవారన్నారు. తిరుమల ప్రక్షాళనకు దేవుడు తనకొక అవకాశం ఇచ్చారని, శ్యామలరావుకి చెప్పి, అందుకనుగుణంగా పనిచేయాలని చెప్పి ఈవోగా నియమించినట్లు వివరించారు. లడ్డూ నాణ్యతపై అనుమానం తోనే 4 ట్యాంకర్లను ఎన్‌డీడీబీ పరీక్షలకు పంపామని, ల్యాబ్‌లో పరీక్షల తర్వాత ఎస్ వాల్యుల్లో భారీ వ్యత్యాసాలు వెలుగు చూశాయని వెల్లడించారు. వెంటనే ఈవో సదరు సంస్థలకు నోటీసులు ఇచ్చి, బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం వంటి చేయాల్సిన బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. తదుపరి చర్యలకు నిపుణుల కమిటీ కూడా వేసి మళ్లీ టెండర్లు పిలిచారన్నారు. అధికారం చేపట్టాక ఇలా అనేక పరిణామాలు చోటుచేసుకుని ఎన్నో వాస్తవాలు వెలుగు చూశాయని తెలిపారు. చేసిన తప్పుని సమర్థించుకుంటూ ప్రధానికి లేఖ రాయటానికి జగన్‌కి ఎంత ధైర్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. రాజకీయ ముసుగులో వచ్చిన నేరస్థుడు కాబట్టే జగన్‌ని ఎస్కోబార్ అన్నానని గుర్తుచేశారు. ఎంతో అపచారం చేసి సమర్థించుకుంటున్నారంటే ఏమనుకుంటున్నారని నిలదీశారు. నిన్నటి నుంచి ఒక్కొక్క స్టేట్మెంట్ చూస్తుంటే కడుపు రగిలిపోయి ఆవేశం వస్తోందని మండిపడ్డారు. టీటీడీ ఛైర్మన్‌గా చేసిన వైవీ సుబ్బారెడ్డి భార్య బైబిల్ పట్టుకుని తిరుగుతుందని గుర్తుచేశారు. మరో మాజీ ఛైర్మన్ భూమన తన ఇంట్లో పెళ్లిని క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం చేశాడన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకు మత సామరస్యాన్ని కాపాడడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. తనకు నచ్చిన దేవుడికి పూజ చేసుకోవడం తన కర్తవ్యమన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినే విధంగా చేసిన అపచారాలన్నీ కప్పిపుచ్చుకుంటూ ఎదురు దాడి చేస్తే ఎలా అని ప్రశ్నించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 3.75 లక్షల వీఐపీ టిక్కెట్లు ఇచ్చుకున్నారని తెలిపారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చిరంజీవి

**మొదటి పేజీ తరువాయి...**

డాన్స్ చేసేవాడినని చెప్పారు. ఆ తర్వాత ఎన్‌సీసీలో చేరిన తర్వాత రాత్రిళ్లు భోజనం ప్లేట్‌తో దరువేస్తూ డాన్స్ చేసేవాడినని నాటి రోజులను చిరంజీవి జ్ఞాపకం చేసుకున్నారు. డాన్స్ చేస్తూ పడి కాలుకు దెబ్బతగిలితే,ఆ తర్వాత వేసిన స్టెప్పులు నాగిని డాన్స్‌గా మారాయని చిరంజీవి చెప్పారు. సినిమాల్లోకి వచ్చిన మొదట్లో తనను సావిత్రి, రోజారమణి, నరసింహరాజు ప్రోత్సహించారని, వారి ప్రోద్బలంతోనే ప్రాణం ఖరీదు సినిమాలో డైరెక్టర్ క్రాంతికుమార్ నా కోసం ఓ డ్యూయెట్ పెట్టి స్టెప్పులు వేయించడంతో తన ప్రయాణం ఇక్కడి వరకూ వచ్చిందన్నారు. పునాదిరాళ్లు సినిమాతో నా డ్యాన్స్ ప్రధాన ఆకర్షణగా మారిందన్నారు. నిర్మాత అశ్వనీదత్ అల్లు అరవింద్ ప్రతి సినిమాలో ఆరు పాటలు ఉండేలా చూసే వాళ్లని వారితో పాటు తనతో పనిచేసిన దర్శక నిర్మాతలకు, హీరోయిన్లకు, డ్యాన్స్ కొరియోగ్రాఫర్లకు చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు.

**చిరంజీవికి నేను అభిమానిని: అమీర్‌ఖాన్**

ఈ కార్యక్రమానికి పిలవగానే వచ్చిన అమీర్‌ఖాన్‌కు చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అమిర్, తాను చిరంజీవికీపెద్ద అభిమానిని అని తెలిపారు. ఆయన ఈ కార్యక్రమానికి రావాలని రిక్వెస్ట్ చేస్తే, తాను ఆర్డర్ వేయండన్నానని చిరుపై తన అభిమానాన్ని అమిర్ గుర్తు చేసుకున్నారు. చిరంజీవి ప్రతి పాటకు ప్రాణం పెట్టి డ్యాన్స్ వేస్తారని, ఆయన తన సోదర సమానులని అమిర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వనీదత్, రాఘవేంద్రరావుతో పాటు తెలుగు చిత్రపరిశ్రమ ప్రముఖులు పాల్గొన్నారు.కాగా గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన చిరంజీవికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఇది తెలుగు వారి గర్వించదగ్గ అంశంగా పేర్కొన్నారు. చిరంజీవికి గిన్నీస్ బుక్‌లో చోటు లభించడం పట్ల శుభాకాంక్షలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిరంజీవి తన గ్రేస్‌తో తెలుగు సినిమాను మరో ఎత్తులకు తీసుకెళ్లడంతో తిరుగులేని కృషి చేశారని అన్నారు.

## మత కార్యక్రమాలను కలుషితం చేస్తున్న డీజేలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్)** పండగ వచ్చినా పెళ్లి జరిగినా ఇంకా ఏ శుభకార్యమైనా ఇప్పుడు అందరికీ డీజే ర్యాలీలు తీయడం ఒక ఆనవాయితీగా మారింది. కుటుంబ సభ్యులతో, స్నేహితులతో సరదాగా డాన్సులు చేస్తూ ఊరంతా తెలిసేలా హోరెత్తించడం ఇప్పుడు ఒక సంప్రదాయంగా మారింది. డీజే కొట్టు, దుమ్ము రేపు అన్నట్లుగా ముఖ్యంగా యువత దీనికి బాగా ఆకర్షితులవుతున్నారు. కొందరు ఈ డీజే సౌండ్‌లతో చెవులకు చిల్లులు పడేలా నానా హంగామా చేస్తున్నారు. కానీ అది ఆ చుట్టుపక్కల వారికి ఇబ్బందికరంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. డీజే డాన్సులతో యువత చెడిపోతున్నారని, తద్వారా ప్రజల్లో దీని వల్ల ఎలాంటి మంచి సందేశం వెళ్లడం లేదని అన్నారు. అందుకే మతపరమైన ర్యాలీల్లో డీజేలపై నిషేధం విధించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఒవైసీ విజ్ఞప్తి చేశారు. డీజే సంస్కృతితో ఆధ్యాత్మిక వాతావరణం కలుషితం అవుతోందని అనడంతో పాటు మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో భాగంగా చార్మినార్ వద్ద డీజే బాక్స్ పేలడంపై స్పందించారు. ఇది ఏ మాత్రం సమాజానికి పనికి వచ్చే చర్య కాదన్నారు. డీజే కావాలి అని కోరుకునే వాళ్లకు క్లబ్బులు, పబ్బులు లాంటివి సిద్ధంగా ఉంటాయని, అంతేకాని ఇలా నడిరోడ్డు మీద డీజే అంటూ పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించడం సరికాదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.మిలాద్ ఉన్ నబీ వేడుకల సమయంలో చార్మినార్ వద్ద డీజే బాక్స్ పేలిపోయి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానిక అధికారులు ఆ మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. డీజే పేరుతో కొంతమంది చేసే వికృత చేష్టలు, విన్యాసాలతో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయి. మరోవైపు, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలో ఉరడీ మధు అనే యువకుడు డీజే శబ్దానికి గుండెపోటు వచ్చి మృతి చెందాడు. ఈ క్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలంగాణలో డీజేను శాశ్వతంగా బ్యాన్ చేయాలని తెలిపారు. డీజే పేరుతో యువత హద్దులు మీరి ప్రవర్తిస్తోందని మతపరమైన కార్యక్రమాలే కాదు, తెలంగాణలో డీజేకు అనుమతులు ఇవ్వొద్దని, శాశ్వతంగా నిషేధం విధించాలని అసదుద్దీన్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

## గాజాలోని పాఠశాలపై ఇజ్రాయెల్ దాడి

**గాజా సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** గాజా నగరంలోని ఓ పాఠశాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఏడుగురు మృతి చెందారు. ఈ వ్యక్తులు తమ ప్రాణాలను కాపాడుకోవడం కోసమని పాఠశాలలో ఆశ్రయం పొందుతున్నారు. కాగా, ఈ ఘటనపై పాలస్తీనా అధికారులు సమాచారం ఇచ్చారు. అయితే పాఠశాల ఆవరణలో తలదాచుకున్న వారిని చంపేందుకు లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. ఆదివారం కాఫర్ ఖాసెం స్కూల్‌లో ఈ దాడి జరిగినట్లు అధికారులు తెలిపారు. మృతి చెందిన వారిలో హమాస్ పబ్లిక్ వర్క్స్ అండ్ హౌసింగ్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మజీద్ సలేహ్ ఉన్నారు. హమాస్ మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకుని దాడి చేశామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ తెలిపింది. అక్కడి పౌరులకు ఎలాంటి నష్టం జరగకుండా వైమానిక దాడులు, ఇతర చర్యలను నిర్వహించామని చెప్పారు. ఆసుపత్రులు ఇతర ప్రభుత్వ భవనాలను సైనిక ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నట్లు ఇజ్రాయెల్ చేసిన వాదనలను హమాస్ ఎప్పటిలాగే తిరస్కరించింది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ దళాలపై తమ సైనికులు అనేక దాడులు చేశారని హమాస్ సాయుధ విభాగం తెలిపింది. నివేదికల ప్రకారం మధ్య, దక్షిణ గాజా అంతటా వేర్వేరు వైమానిక దాడుల్లో ఆరుగురు అదనపు పాలస్తీనియన్లు మరణించారు. దీంతో ఆదివారం నాటి ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 16కి చేరింది. హమాస్ సాయుధ విభాగం రఫాలో ఇజ్రాయెల్ దళాలపై అనేక దాడులు చేసింది. ఇజ్రాయెల్ సైన్యం ప్రతిస్పందనగా, రఫాలో తమ బలగాలు అనేక మంది మిలిటెంట్లను హతమార్చాయని, అంతేకాకుండా సైనిక మౌలిక సదుపాయాలను కూల్చివేశాయని పేర్కొంది. అయితే ఈ వివాదం మధ్య అవసరమైన విడి భాగాలు, జనరేటర్లకు ఇంధనం కొరత కారణంగా అన్ని ఆసుపత్రి సేవలు పది రోజుల్లో నిలిపివేయవచ్చని ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. అదనంగా, భారీ వర్షం దేరా శిబిరాల్లో వరదలకు కారణమైంది. తద్వారా నిర్వాసిత కుటుంబాల దుస్థితి మరింత తీవ్రమవుతోంది. యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జూలియెట్ టౌమా మాట్లాడుతూ.. శీతాకాలం రాబోతోందని, ప్రజలకు ఆశ్రయం, సామాగ్రి అవసరమని అన్నారు. గతేడాది అక్టోబర్ 7 నుంచి ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్ పై దాడి చేసింది. ఇందులో దాదాపు 1200 మంది చనిపోయారు. దీని తరువాత, ఇజ్రాయెల్ దాడుల్లో 41,300 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు.

## రాజకీయ సన్యాసం తీసుకుంటా

**మొదటి పేజీ తరువాయి...**



11 పైసల నుంచి 20 పైసల వరకు మాత్రమే ఇచ్చారన్నారు. 1999 నుంచి 2014 వరకు కేవలం రూ.376 కోట్లు మాత్రమే సింగరేణి కార్మికులకు ఇచ్చారు. కాంగ్రెస్ పాలనతో లాభాలు ఎన్నడూ రూ.400 కోట్లు దాటలేదు. లాభాలను వెయ్యి కోట్లు దాటించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే. తొమ్మిదిన్నరేండ్లలో తాము రూ.2,780 కోట్లు ఇచ్చామని చెప్పారు. 2022-23లో సింగరేణి లాభాల్లో కార్మికులకు 32 శాతం వాటా ఇచ్చాం. సగటున ఒక్కో కార్మికుడికి రూ.లక్షా 60 వేలు చెల్లించాం. సింగరేణిని, కార్మికులను ముఖ్యమంత్రి వెన్నుపోటు పోడుస్తున్నడు. కార్మికుల రెక్కల కష్టాన్ని కాంగ్రెస్ సర్కార్ దోచుకుంటున్నది. 33 శాతం వాటా ఇస్తున్నామని సీఎం తప్పుడు ప్రకటనలు చేస్తున్నడు. సింగరేణి లాభాలు రూ.4701 కోట్లు అయితే 33 శాతం వాటా ఇచ్చామంటున్నారు. కార్మికులకు రూ.1551 కోట్లు బోనస్ ఇవ్వాలి. ఒక్కో కార్మికుడికి రూ.3.70 లక్షలు రావాలి. కానీ రూ.లక్షా 90 వేలు మాత్రమే ఇస్తున్నరు. 16 శాతం మాత్రమే ఇస్తున్నామని కాంగ్రెస్ ఒప్పుకోవాలి. సింగరేణి కార్మికులను మోసం చేయకండి. స్పష్టంగా చెప్పండి' అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. అనుబంధ సంఘాన్ని గెలిపించినందుకు మీరిచ్చేది ఇదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కుట్రపూరిత వైఖరిపై సీపీఐ కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడక పోతే సింగరేణిని ప్రైవేటుపరం చేస్తారన్నారు. ఈ కుట్రను కార్మికులు గుర్తించాలన్నారు. తాము చెప్పినదాంట్లో తప్పుంటే ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు.

## పాకిస్తాన్‌తో చర్చల ప్రసక్తే లేదు

**మొదటి పేజీ తరువాయి...**

చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రాజౌరి జిల్లా నౌషేరాలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై అమిత్ షా విరుచుకుపడ్డారు. 'జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగ అధికరణం 370ని రద్దు చేస్తూ గతంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కానీ తమకు అధికారం వచ్చాక ఆ ఆర్టికల్‌ను పునరుద్ధరిస్తామని ఫరూక్ అబ్దుల్లా చెబుతున్నారు. ఏ శక్తీ దాన్ని తిరిగి తీసుకురాలేదు. ఇప్పుడు ఈ ప్రాంతంలో బంకర్ల అవసరం లేదు. ఎందుకంటే కాల్పులు జరిపే సాహసం ఎవరూ చేయలేరు. జమ్మూకశ్మీర్‌లో కేవలం మన దేశ త్రివర్ణ పతకం మాత్రమే రెపరెపలాడుతుంది' అని అమిత్ షా చెప్పారు. 'కొందరు పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని బలంగా కోరుకుంటున్నారు. కానీ ఉగ్రవాదం అంతమయ్యే వరకు ఆ దేశంతో ఎలాంటి చర్చలు జరిపేది లేదు. దేశంపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను జైలు నుంచి విడుదల చేయాలని కాంగ్రెస్ నేతలు కోరుకుంటున్నారు. కానీ మోదీ సర్కార్ అలా ఎప్పటికీ చేయదు. భారత ప్రజలపై రాళ్లు రువ్విన వారికి కారాగారం నుంచి విముక్తి కల్పించేది లేదు' అని షా స్పష్టం చేశారు.కాగా జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత మొదటిసారి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 18న తొలి విడత పోలింగ్ పూర్తయ్యింది. సెప్టెంబర్ 25న రెండో విడత, అక్టోబర్ 1న మూడో విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.



## జగన్ ఇంటి ముందు జై శ్రీరామ్ నినాదాలు

**మొదటి పేజీ తరువాయి...**

అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్యుద్ధాలు జరుగుతున్నాయి. కేంద్రమంత్రులు సైతం ఈ వ్యవహారాన్ని సీరియస్ గా పరిగణించారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై టిటిడి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈఓ లడ్డూ కల్తీపై ప్రాథమిక నివేదికను ఆయనకు అందజేయగా దానిపై చర్చించారు. అలాగే ఆలయ సంప్రోక్షణపై కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా హిందూవాదులు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇంటి దగ్గర నిరసనకు దిగారు. జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. తిరుమల లడ్డూల తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు, చేపనూనె వాడారని తేలడంతో గత ప్రభుత్వ తీరుపై హిందూవాదులు మండిపడుతున్నారు. మాజీ సీఎం ఇంటి దగ్గర నిరసనలు చేపట్టారు. దీనికి జగన్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ఉద్రిక్తంగా మారడంతో.. పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నిరసన కారులను అరెస్ట్ చేసి తాడేపల్లి పీఎస్ కు తరలించారు.

## క్వాడ్ ఎవరికీ వ్యతిరేకం కాదు: మోదీ

**మొదటి పేజీ తరువాయి...**

సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తుండటంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ, డెలవేర్‌లోని బైడెన్ నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువు నేతలు ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలు, భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చించారు. సమావేశం అనంతరం చర్చలు ఫలప్రదమైనట్టు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు. 'డెలవేర్‌లోని గ్రీన్‌విల్లేలో ఉన్న తన నివాసంలో నాకు ఆతిథ్యమిచ్చినందుకు అధ్యక్షుడు బైడెన్‌కు ధన్యవాదాలు. మా చర్చలు ఫలవంతమయ్యాయి. ఈ సమావేశంలో ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై చర్చించడానికి మాకు అవకాశం లభించింది' అంటూ ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ ట్వీట్‌కు బైడెన్ స్పందించారు. భారత్‌తో అమెరికా భాగస్వామ్యం చరిత్రలో ఎప్పుడూ లేనంత బలమైందని చెప్పారు. ఇరు దేశాల భాగస్వామ్యం సన్నిహితమైంది, చైతన్యవంతమైనదని తెలిపారు. మోదీతో భేటీ అయిన ప్రతిసారీ ఇరు దేశాలకు సంబంధించిన కొత్త అంశాలపై చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

## కల్తీ నెయ్యిపై.. ప్రధానికి వైఎస్ జగన్ లేఖ

**మొదటి పేజీ తరువాయి...**

ఏజెన్సీల నుంచి తప్పనిసరిగా ధృవీకరణ ఉండాలనే నిబంధన అమలు చేస్తారన్నారు. అలాగే ఆలయంలోనికి వెళ్లే ముందు ప్రతి ట్యాంకర్ నుంచి మూడు నమూనాలను తీసుకుని పరీక్షిస్తారని, ఈ మూడు శాంపిళ్లలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత మాత్రమే నెయ్యిని ఉపయోగించడానికి అనుమతిస్తారని లేఖలో తెలిపారు. ఏ పరీక్షల్లోనైనా సందేహాస్పద పదార్థాలు కనిపిస్తే ఆ ట్యాంకర్‌ను తిరస్కరిస్తారని, ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించరన్నారు. 2024, జులై 12న తిరుమలకు నెయ్యి ట్యాంకర్లు రాగా, కల్తీ జరిగిందని తిరస్కరించారని తెలిపారు. తిరస్కరించిన ఆ ట్యాంకర్లలోని నెయ్యిని లడ్డూ తయారీలో వాడలేదని జగన్ ప్రధానికి తెలిపారు. ట్యాంకర్లు వెనక్కి పంపారని, ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వాడలేదని తెలిసి కూడా చంద్రబాబు నాయుడు బాధ్యతా రాహిత్యంగా, వ్యాఖ్యలు చేశారన్నారు. కోట్లాది మంది తిరుమల భక్తుల్లో ఆవేదనకు దారి తీసిందన్నారు. పోషకాహార లోపం ఉన్న ఆవు నుంచి వచ్చే పాల నుంచి నెయ్యి పొందినట్లయితే లేదా పామాయిల్ అధికంగా తినిపించిన ఆవు పాల నుంచి నెయ్యి పొందినట్లయితే, జంతువు కొవ్వు ఉనికిని సూచించే పరీక్షల్లో కచ్చితత్వంతో సరైన ఫలితాలు కనుగొనేందుకు అవకాశాలు ఉండవని పరీక్షలు జరిపి నిర్ధారించిన సంస్థ తెలిపిందని వివరించారు. చంద్రబాబు అసత్య ప్రచారాలు చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. తన రాజకీయాల కోసం చంద్రబాబు టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చుతున్నారని ఆరోపించారు. సున్నితమైన అంశాన్ని రాజకీయాలకోసం వాడుతున్నారన్నారు. పరీక్షల్లో ఖచ్చితత్వంపై నిర్ధారణ లేకుండా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి దిగ్భ్రాంతి కలిగించే ఆరోపణలు చేయకూడదన్నారు. చంద్రబాబు నాయుడును తీవ్రంగా మందలించాల్సిన అవసరం ఉందన్న జగన్, దీంతోపాటు నిజానిజాలను వెలుగులోకి తీసుకు రావడం అత్యవసరమన్నారు. చంద్రబాబునాయుడు సృష్టించిన అనుమానాలను నివృత్తి చేయాలని ప్రధానిని జగన్ కోరారు. ఇదే అంశంపై రెండు రోజుల క్రితం మీడియా సమావేశంలో మాట్లాడిన జగన్, కేంద్రంలోని బీజేపీ పెద్దలపై విమర్శలు చేశారు. బీజేపీ వారికి సగం తెలుసు, సగం తెలియదని అన్నారు. టీటీడీ బోర్డులో బీజేపీలోని సీనియర్లు సభ్యులుగా చేశారని, ఈ ప్రొసీజర్లు వారికి తెలియవా అని ప్రశ్నించారు. తెలియకపోతే తెలుసుకోమనండని అన్నారు. బీజేపీ వారు నిజంగానే హిందువులకు నిజాయతీగా ప్రాతినిధ్యం వహించే వారైతే ఇంత దుర్మార్గంగా ప్రచారం చేయడం ధర్మమేనా అని చంద్రబాబుకు గట్టిగా అక్షింతలు వేయాలంటూ జగన్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కల్తీ నెయ్యి ఘటనలో వివరణ ఇవ్వకుండా, చంద్రబాబుపై రాజకీయ ఆరపణలు చేస్తూ జగన్ ప్రధాని మోదీకి లేఖ రాయడం ఆసక్తిగా మారింది.

## ఆమ్ బజార్ రోడ్డుకు మరమ్మతులు



**ఇల్లందు, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణ పరిధిలోని ఆమ్ బజార్ రోడ్డు కింద భాగాన మిషన్ భగీరథ పైపులైను ఉండటం చేత పైపు లీకేజీ కారణంగా సిసి రోడ్డు కొట్టుక పోయిందని అప్పుడు హడావిడిగా తాత్కాలిక మరమ్మతులు చేశారని నేటికీ సంవత్సరం కావస్తున్న ఏర్పడ్డ గుంతకు మరమ్మతులు చేపట్టకుండా అలసత్వం వహిస్తున్నారు అంటూ. స్థానిక వ్యాపారస్తులు వాపోతున్నారు. అసలే ఇరుకైన దారులు నెలలు తరబడి జాప్యం చేస్తున్నారని నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్లలో యాక్సిడెంట్ లు జరిగే అవకాశం ఉన్నందున ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. నిఘా దినపత్రికలో కథనం రావడంతో అధికారులు స్పందించి రోడ్డు మరోమ్మతులు చేపట్టారు. దీంతో స్థానిక వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## పోచంపల్లిలో అంబేద్కర్ విగ్రహంపై దాడి



**వలిగొండ, సెప్టెంబరు 22 (నిఘా న్యూస్):** పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామం లో అంబేద్కర్ విగ్రహంపై దుండగులు చేసిన దాడిని ఖండిస్తూ శిక్షించాలని జై భీమ్ సేన కమిటీ అధ్యక్షులు వల్లమల్ల రత్నయ్య, కమిటీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమం లో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమాజంలో అన్ని వర్గాల శ్రేయస్సు కోసం పోరాడి భారత రాజ్యాంగం అందించినటువంటి మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భీమనపల్లిలో దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి శిక్ష విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ సేన కమిటీ సభ్యులు సంగిశెట్టి చంద్రయ్య సంగిశెట్టి విజయ్ కుమార్ నీలం నరేందర్ కట్ట సురేష్ సంగిశెట్టి రమేష్ సంగిశెట్టి సుందర్రావు సంగిశెట్టి మాణిక్యరావు ఎర్ర భూపాల్ వల్లమల్ల శంకరయ్య కట్ట మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## రామంతపూర్ సిపిఎం కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



**రామంతాపూర్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** రామంతపూర్ లోని రాజేంద్రనగర్ శాఖ సిపిఎం మహాసభ ఆదివారం నిర్వహించారు. మహాసభలో శాఖ కార్యదర్శిగా వై.వెంకటేశ్వర్లు ఎన్నుకోవడం జరిగిందని సిపిఎం ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె వెంకన్న తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకురాలు ఎం.వినోద, ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న మాట్లాడుతూ రామంతపూర్ లోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకొని గాంధీనగర్ కి బస్సు సౌకర్యాలు కల్పించాలని స్థానికంగా రోడ్లు డ్రైనేజీ కరెంటు తదితర సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు నామాల శీను, యాదగిరి హుస్సేన్, లక్ష్మణ్, సీతారాములు, దయానంద్, సర్కిల్ కమిటీ సభ్యులు శేషు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరత్నాపూర్ లో స్వచ్ఛతా హి సేవ




**తూప్రాన్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** తూప్రాన్ మండలంలోని వెంకటరత్నాపూర్ ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హి సేవా 2024 పక్షోత్సవాల కార్యక్రమాన్ని అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నారు. స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత పేరుతో గ్రామంలో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఏ మల్లేష్, మాజీ వార్డు సభ్యులు సంజీవ్, జి. కిషన్, చిన్న మల్లేష్, డి.మల్లేష్, జి.యాదగిరి, రాములు, ఏ.యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన భరతనాట్య ప్రదర్శన



**ఉప్పల్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** ఉప్పల్ మినీ శిల్పా రామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం రాయచూరు నుండి శ్రీ రాఘవ నాట్యామృత కళానికేతన్ నాట్య గురువులు శ్రేయస్ జోషి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలో గణేశా గానం, త్రిమాత కౌత్వం, శివ స్తుతి, దశావతారం, అన్నమయ్య కృతి, కళింగ నర్తన, అభంగ్ నృత్య ప్రదర్శనలు శ్రీ శ్రేయస్, భవాని, కృతిక, వర్ష, భవ్య, సన్నిధి, శ్రీనిధి, మనస్వి, ఖుషి, ఆపేక్ష మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే





**మౌలాలి, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఫస్ట్ ఫేజ్ ప్లే గ్రౌండ్ లో శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం కాప్రా సర్కిల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీ విరాట్ విశ్వకర్మ18వ యజ్ఞమహోత్సవము కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విశ్వశాంతి కోసమై విశ్వకర్మలు ప్రతి సంవత్సరం ఈ స్థలంలో యజ్ఞం నిర్వహించడం, పూజలు చేస్తూ ఆ భగవానుడిని ఆరాధించడం గొప్ప విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమిటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం మంచి విషయమని అన్నారు. యజ్ఞ కార్యక్రమానంతరం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని యజ్ఞ మహోత్సవము నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా సాయంత్రం యజ్ఞోత్సవాల ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, సంఘ అధ్యక్షులు నూతలపాటి మల్లికార్జున చారి, చైర్మన్ కేశోజు లక్ష్మీనారాయణ చారి, ప్రధాన కార్యదర్శి సమ్మని మురళి చారి, గౌరవ అధ్యక్షులు కేతోజు శ్రీనివాస చారి, యజ్ఞ కమిటీ అధ్యక్షులు కమ్మని సత్యనారాయణ చారి, కమ్మరి బాలకృష్ణ చారి, ప్రభాకర్ చారి, నాయకులు వసంత రావు, మల్లేష్ గౌడ్, ఉల్లెం బాలరాజు, నవీన్ గౌడ్, రామకృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడల ముగింపు ఉత్సవాలు



**వలిగొండ, సెప్టెంబరు 22 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో 68 వ వలిగొండ మండల స్థాయి పాఠశాలల క్రీడోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రధానోపాధ్యాయులు ఎస్ భాస్కర్, సంగెం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, మరియు మనం యూత్ అసోసియేషన్ సభ్యులు బహుమతులు ప్రధానం చేశారు. దాదాపుగా 750 మంది క్రీడాకారులకు రెడ్లరేపాక వాస్తవ్యులు మహమ్మద్ జానీ భాష, ఖాజా భోజనం అందించారు. బహుమతులు మనం యూత్ అసోసియేషన్ సభ్యులు బహుకరించారు. 17 సంవత్సరాల బాలికల కబడ్డీ విభాగంలో టేకులసోమారం ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి అరూర్, 17 సంవత్సరాల బాలుర ఖో-ఖో లో ప్రథమ బహుమతి సంగెం, ద్వితీయ బహుమతి జెడ్పిహెచ్ఎస్ వలిగొండ 17 సంవత్సరాల బాలికల ఖో-ఖో విభాగంలో ప్రథమ బహుమతి మోడల్ స్కూల్ లోతుకుంట, ద్వితీయ బహుమతి సంంగెం, 17 సంవత్సరాల బాలుర వాలీబాల్ లో ప్రథమ బహుమతి సంగెం, ద్వితీయ బహుమతి జెడ్పి హెచ్ఎస్ వలిగొండ. జట్లకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాయామ ఉపాధ్యాయులు, జి.స్వామిరాజు, జి.చండీదాస్, ఏ.మల్లేశం, ఎ.మహేష్, జయరానీ,రాంప్రసాద్, సంధ్యారాణి, మాధవి, ఐలయ్య,పాల్, పరశురాం జిలానీ, నాగేందర్, మల్లేష్, వెంకటేశ్వర్లు,శివాజీ, లింగయ్య, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉచితంగా భగవద్గీత పుస్తకాల పంపిణీ



### తితిదే కార్యక్రమాలను విస్తృత పరచాలి

### మంత్రి టి.జి.భరత్ పిలుపు

**కర్నూలు, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** భగవద్గీత సృష్టిలో అత్యంత ఉన్నతమైన గ్రంథమని, మన దేశం గొప్పతనాన్ని నాదేశం భగవద్గీత, నాదేశం అగ్నిపునీత సీత, నాదేశం కరుణాంతరంగ, నాదేశం సంస్కార గంగ, అని ప్రపంచదేశాల్లో ప్రతి భారతీయుడు ఎలుగెత్తి చాటుటకు గర్వకారణమైన గ్రంథం అని, అటువంటి గ్రంథం గొప్పతనాన్ని విద్యార్థులకు చిన్న వయసులోనే తెలియ జేయవలసిన అవసరం ఎంతో ఉన్నదని రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి టి.జి.భరత్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు నగరంలోని ఇండస్ మాంటిస్సోరి విద్యాసంస్థలలో మానవులందరికీ భగవద్గీత పుస్తకావిష్కరణ చేసి విద్యార్థులకు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం, సదాచారం కూడా నేర్చుకోవాలని, మాకు విద్యనందించిన ఉపాధ్యాయుల ముందు ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషాన్ని కలిగించిందని అన్నారు. మాంటిసోరి ఇండస్ నుండి భాగవత, రామాయణం, భగవద్గీత మొదలైన పోటీల్లో పాల్గొని జాతీయస్థాయిలో విజేతలయిన విద్యార్థులందరికీ మంత్రి అభినందనలతో పాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా విశ్రాంత సర్వోన్నతాధికారి కుమావత రామశంకర నాయక్, జిల్లా విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ పూజారి మోక్షేశ్వరుడు, ఇండస్ మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కె.ఎన్.వి.రాజశేఖర్, బి.యం.మీనాక్షి , పి.విల్సన్ అగస్టీన్, శ్రీనివాసులు రెడ్డి, కామేశ్వరి, మధుసూదన్, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, గీతా ప్రచార సంఘం అధ్యక్షులు డి.వి.రమణ, ధర్మప్రచార మండలి సభ్యులు ఎద్దుల మహేశ్వర రెడ్డి, మారం నాగరాజు గుప్తా, అవోపా చీఫ్ మలిపెద్ది నాగేశ్వరరావు, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సంప్రదాయ నృత్యాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి.

# 48 గంటల్లోగా... రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమ





- రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు కృషి
- దీపావళి రోజున ఉచిత గ్యాస్ పథకం ప్రారంభం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం/కోటబొమ్మాళి, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని, రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు కృషి చేస్తున్నామని, చంద్రబాబు 6 పథకాలలో భాగంగా దీపావళి రోజున ఉచిత గ్యాస్ పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామంలో ఆదివారం ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి పరిసర గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలియజేయాలని గ్రామస్తులకు తెలియజేయగా గ్రామంలో విద్యుత్, రహదారి, తదితర సమస్యలపై గ్రామస్తులు మంత్రికి వివరించారు. ప్రజల ఆరోగ్యమే ముఖ్య లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అందులో భాగంగా కొత్తపల్లి గ్రామానికి సుజలధారతో ఇంటింటికి త్రాగునీరు అందించడానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన శాఖలు తన దగ్గరే ఉన్నట్లు ఎవరికీ ఎ సమస్య వచ్చినా తన దగ్గరకు వస్తే పరిష్కారం చూపిస్తానని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం గడచిన అయిదేళ్లలో మొత్తం 12 లక్షల కోట్లు అప్పులు చేసిందని వివరించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని కోలుకోని దెబ్బ తీసిందన్నారు. సహజ వనరులు, ఇసుకపై భారీ ఎత్తున దోపిడి చేసిందన్నారు. సార్వత్రిక ఎన్నికలలో కూటమికి అవకాశం ఇచ్చిన ప్రజలందరికీ అభినందనలు తెలియజేశారు. అంతే కాకుండా రాష్ట్రంలో 22 మంది పార్లమెంట్ సభ్యులను గెలిపించి కేంద్రంలోని పట్టు కల్పించారు. వంద రోజుల్లో కేంద్ర ప్రభుత్వం సహకారం అందించడం వలనే కొంత సంక్షేమం సాధించడమైనదన్నారు. కష్ట సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు ఒకేసారి రూ.1000 పెంచి రూ.4 వేలు ఇవ్వడం ఒకటైతే, మొదటి నెల ఒక్కొక్కరికీ రూ.7000 లు చొప్పున ఒకరోజు రాష్ట్రం మొత్తం మీద 65.18 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ.4,408 కోట్లు పంపిణీ చేయడం దేశంలోనే ఒక తిరుగులేని సంక్షేమ చరిత్రన్నారు. ప్రజలకు నిద్ర లేకుండా చేసిన "ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్"ను చంద్రబాబు రద్దు చేశారని, తద్వారా ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడమైనదని, త్వరలోనే రాజముద్రతో పాస్ పుస్తకాలు జారీ చేస్తామన్నారు. తక్కువ ధరలకే నాణ్యమైన మద్యం అందిస్తామని చెప్పారు. ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. వంద రోజుల పాలన సంతృప్తి నిచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే వివిధ కులాల వారికి రుణాలు అందజేస్తామని చెప్పారు. ఇంటిలో భర్త మరణిస్తే భార్యకు ఫించను వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతే కాకుండా తల్లికి వందనం అందజేసేందుకు చర్యలు చేపట్టామని ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్కలి రెవెన్యూ డివిజనల్ అధికారి సుదర్శన దొర, కోటబొమ్మాళి మండల ప్రత్యేక అధికారిణి బి.సి.కార్పొరేష్ ఇడి గడ్డెమ్మ, ప్రెసిడెంట్ శిమ్మ సింహాచలం తహసీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఓ ఫణింద్ర, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహంపై దాడికి నిరసన



**భువనగిరి, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో సామాజిక న్యాయ శిల్పం అయిన మహనీయ డా. బీ ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం పై దుండగులు చేసిన దాడిని ఖండిస్తూ ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా లో ఇటుకల దేవేందర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నల్ల జండాలతో నిరసన వ్యక్తం చేశారు. భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డా.బీ ఆర్ అంబేద్కర్ విగ్రహం పై దాడి సభ్య సమాజం తలదించుకునే ఘటన. దాడి చేసి దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి కఠిన చట్టాలు నమోదు చేసి తీవ్రంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 26 వ వార్డ్ కౌన్సిలర్ ఈరపక నర్సింహ దర్గాయి హరిప్రసాద్ సిర్పంగా శివలింగం ఇటుకల దేవేందర్ ఆనంపట్ల కృష్ణ బర్రె సుదర్శన్ కాంచపల్లి నర్సింగ్ రావు సిరిపంగా సుభాష్ గ్యాస్ చిన్న నరికడప మధు మాదిగ అందే సాయి బద్దుల సత్యనారాయణ డాకురి ప్రకాష్ బండారు బల్ నర్సింహ కోళ్ల కృష్ణ జయరావు బండారు స్వామి తొర్రి సురేష్ లు తదితరులు పాల్గొన్నారు.

## నలంద కాలేజి పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**తూప్రాన్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** తూప్రాన్ నలంద జూనియర్ కళాశాల 2004-06 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థిని విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నలంద విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పివి రమణ, ఇంచార్జి రవీందర్, ఉపాధ్యాయులు సంజీవ్ మురళీకృష్ణ, హరిశ్ పాల్గొన్నారు.

## ప్రేరణ ఆధ్వర్యంలో వృద్ధులకు మంచినీటి సరఫరా





**వలిగొండ, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని (ఎం)తుర్కపల్లి గ్రామంలో ప్రేరణ సేవా సమితిఅనే సంస్థ ద్వార ఉచిత మంచినీటి సరఫరా ను నరాముల మల్లేశం, బద్దం చంద్రశేఖర్ రెడ్డి, నోముల సురేష్, మాధవరెడ్డి, యాస రత్నాకర్ రెడ్డి, సల్ల శ్రీశైలం, పల్సం గణేష్, పల్సం మచ్చగిరి, పల్సం మత్స్యగిరి, మర్రి బాలరాజు,బద్దం శ్రీకాంత్ రెడ్డి, వనం కిరణ్, అందరూ కలిసి గ్రామములోని వృద్ధులకు అనగా నీళ్ల కేంద్రం వద్దకు వచ్చి, నీరు తెచ్చుకోలేని వారందరికి ఉచితంగా మంచి నీరు సరఫరా చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపుగా గ్రామంలోని 120 మంది వృద్ధులకు మేలు జరుగుతుంది, ఉచితంగా ఇంటి వద్దకే మంచినీరు రావడంతో వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు.

## రిపోర్టర్ చంద్రఖర్ కు మాజీ మేయర్ సాయం




**మేడిపల్లి, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** తీవ్ర అనారోగ్యానికి గురై దుర్గాభాయ్ దేశముఖ్ అసుపత్రిలో చికిత్స పొందుతున్న రిపోర్టర్ చంద్రశేఖర్ ను పీర్జాదిగూడ బీఆర్ఎస్.నాయకులు వెంకట్ రెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను వెంకట్ రెడ్డి పరామర్శించి తన వంతుగా కొంత ఆర్థిక సహాయం అందజేసి వారికి ధైర్యం చెప్పారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మానవతాదృక్పథంతో ప్రతి ఒక్కరూ వారికి, కుటుంబ సభ్యులకు అండగా నిలవాలని కోరుతూ ఫోన్ పే, గూగుల్ పే ద్వారా తోచిన ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం 8688863815 ఈ నెంబరకు సంప్రదించగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, 4వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు యాసారం శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ చిన్నారుల చికిత్స సాయం అందించారు. ఇటీవల మండల పరిధిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన చిన్నారులను ఎస్ఐ రాజశేఖర్ పరామర్శించారు.ఈ సందర్భంగా గాయపడిన చిన్నారులను చూసి చలించి పోయిన ఎస్ఐ.రాజశేఖర్ తనవంతు సాయంగా ఒక్కొక్కరికి 5వేల రూపాయలు చొప్పున 30వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఎస్ఐ రాజశేఖర్ పై ప్రశంశల జల్లు కురిపిస్తున్న మండల ప్రజలు.

*-అశ్వారావుపేట, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):*

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**బాలాపూర్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 12, 13వ డివిజన్లలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి స్థానిక కార్పొరేటర్లు యాతమ్ పవన్ కుమార్, బాలు నాయక్ లు చెత్తను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి తడి చెత్త, పొడి చెత్త పై అవగాహన కల్పించారు. విద్యార్థులు, స్థానికులచే ర్యాలి నిర్వహించి, తమ వీధులు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వి. యాదగిరి, జవాన్ శ్రీనివాస్, ఆర్ పీ లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గణనాధుని నిమజ్జనం



**మేడ్చల్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపాలిటీ పాత గ్రామ పంచాయతీ వద్ద వివేకానంద యూత్ అధ్యక్షుడు కానుకంటి వెంకటేష్ వంజరి అధ్వర్యంలో గణనాధుని నిమజ్జనం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.వివేకానంద యూత్ లడ్డు వేలం పాటలో యూత్ సభ్యుడు నావతి ఫణీంద్ర వంజరి లక్షా 50 వేలకు కైవసం చేసుకోవడం జరిగింది. మొదటి డబ్బుల హారం రాఘవ రెడ్డి 17 వేలకు తీసుకోవడం జరిగింది. రెండవ డబ్బుల హారం శ్రీ వైష్ణవి జువెలర్స్ మొల్లంగిరి రఘు చారీ 22 వేలజువెలర్స్ తీసుకోవడం జరిగింది. కార్యక్రమంలో యూత్ సీనియర్ సభ్యులు, కాలనీ వాసులు,వివేకానంద యూత్ యువకులు పెద్దఎత్తున పాల్గొనడం జరిగింది.

## ఎస్జిటియు మండల అధ్యక్షునిగా జలపతి




**ధర్మపురి, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** సెకండరి గ్రేడ్ టీచర్స్ యూనియన్ ధర్మారం మండల కార్యావర్గాన్ని ఆదివారం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.మండలకేంద్రం లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా బి.జలపతి,మహిళా అధ్యక్షురాలిగా జె.శ్రీదేవి, ప్రధాన కార్యదర్సులుగా కె.మల్లయ్య, ఎమ్.సుజాత, గౌరవ అధ్యక్షులుగా జి.వెంకటరమణ రెడ్డి,అసోషియేట్ అధ్యక్షులుగా కృష్ణహరి, ఆర్థిక కార్యదర్శిగా బి.ప్రకాష్ రెడ్డి,ఉపాధ్యక్షులుగా సురేష్, శ్రీలత,రామకృష్ణ కిరణ్ కౌర్, వంశీమోహనాచార్యులు, నరేష్, క్రిస్టెంజిలీనా, రఫీ, సహాయ కార్యదర్సులుగా ఎన్. రేవతి,భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి,అరుణదేవి,సంపత్, వనజ,జానకి లు ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా మచ్చేందర్ రెడ్డి



**ఘట్ కేసర్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఘట్ కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుగూరి మచ్చేందర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు అగ్రికల్చరల్ అండ్ కో-ఆపరేటివ్ డిపార్ట్ మెంట్ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు విద్యార్థి దశ నుండే నిరంతరం కృషి చేసి అంచేలంచలుగా ఎదిగి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పనిచేస్తున్న చిలుగూరి మచ్చేందర్ రెడ్డి సేవలను గుర్తించి గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమించినట్లు పార్టీ బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా చిలుగూరి మచ్చేందర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ప్రతిష్టకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు తప్పక ఉంటుందన్నారు. తన సేవలను గుర్తించి గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమించేందుకు సహకరించిన నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, మేడ్చల్ బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిడ్ల ముత్యాలు యాదవులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

### ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి




**తాండూరు, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** సేవా భావం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి వెల్లడించారు. జమియతే ఏ ఉలేమా వికారాబాద్ జిల్లా, ముజ్తబా హెల్పింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో తాండూరు పట్టణ కేంద్రంలోని వైట్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించి సంతోషం వ్యక్తం చేస్తూ జమియతే ఏ ఉలేమా సంఘం సభ్యులకు, ముజ్తబా హెల్పింగ్ ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. పైన సూచించిన సంఘం సభ్యులకు, డాక్టర్లకు శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ నగరం నుంచి వివిధ వైద్య వైద్య నిపుణులను రప్పించి నిరుపేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ, ఉచితంగా మాత్రలు పంపిణీ చేయడం గర్వించదగ్గ విషయమని సంఘం సభ్యుల సేవలను కొనియాడారు. నిరుపేద ప్రజలకు సేవలు అందిస్తున్న సంఘాలకు తోడ్పాటు గా ఉంటానని భరోసా కల్పించారు. మెగా ఉచిత వైద్య శిబిరాన్ని 1100 మంది ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. జమాయతే ఏ ఉలేమా హింద్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షులు హాఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్, వారి పర్యవేక్షణలో ప్రత్యేక వైద్య నిపుణులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ తాండూరు పట్టణ అధ్యక్షులు హబీబ్ లాలా, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, ప్రజా ప్రతినిధులు బషీరాబాద్ మండలం ముజ్తబా ఫౌండేషన్ అధ్యక్షులు సిరాజుద్దీన్ అహ్మద్, ఉపాధ్యక్షులు పప్పు, ప్రధాన కార్యదర్శి తాహెర్, సభ్యులు అబ్దుల్ ఖదీర్, జగదీష్, రాజు సంఘాల సభ్యులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈ నెల 29న.. మంజీరా రచయితల సమావేశం

### 38వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేసిన రంగాచారి



**సిద్దిపేట, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** మంజీరా రచయితల సంఘం 38 వ వార్షికోత్సవంను ఈ నెల 29 ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో మొదటి సభ ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుందని, రెండవ సభ మధ్యాహ్నం సాహితీ వేత్తలు దాశరథి, ఆరుద్ర, బిరుదురాజు రామరాజుల శత జయంతి సందర్బంలో జరుగుతుందని మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కె.రంగాచారి తెలుపుతూ తెలుపుతూ ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగాచారి మాట్లాడుతూ ఈ సభలో మానవ జీవన శాలిలో వచ్చిన, వస్తున్న మార్పులు, మరసం కవులు వర్ణించి, కవితా సంకలనంతో జోల పాటలు, మూడు గుడిసేల పల్లె వంటి వాటిని సిద్దెంకి యాదగిరి పిట్టల మధు కవితా సంకలనం మధు గాయాలు కవితా సంకలనం ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. సభలో షేక్ బాబా, అక్కారం సత్తయ్య, జహంగీర్ కళాబృందాలచే సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుతో పాటు విశిష్ట అతిధులుగా ప్రఖ్యాత కవి, కబీర్ సమ్మాన్ పురస్కార గ్రహీత కె.శివారెడ్డి, ఆత్మీయ అతిధులు గా మాజీ శాసన సభ్యులు రసమయి బాలకిషన్, మాజీ ఉద్యోగ సంఘాల నేత దేవి ప్రసాద్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నేత కె.విరాహత్ అలీ, జి.తిరుపతి రెడ్డి, జి.పాపయ్య, గ్యాదరి పరమేశ్వర్ హాజరావుతారని తెలిపారు. రెండవ సభలో ఆరుద్ర సాహితీ స్ఫూర్తి అనే అంశం పై ప్రఖ్యాత కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, బిరుదురాజు రామరాజు పరిశోధనలు సాహిత్యం అనే అంశం పై ప్రొఫెసర్ కాశీం, దాశరథి కవితా చైతన్యం అనే అంశం పై ప్రముఖ కవి గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం మరసం కవులతో కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరసం ప్రతినిధులు, జి.తిరుపతి రెడ్డి,పప్పుల రాజి రెడ్డి,తైదల అంజయ్య,తోట అశోక్, అలాజ్ పూర్ కిషన్, మచ్చ రాజశేఖర్ రెడ్డి, వెంకట సత్యకుమార్, సుదగోని మధు, నాంపల్లి రాజు, ప్రముఖ సాహితీ వేత్త, కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసిన కాంగ్రెస్


### పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం అవమానం

### డా.ఎర్రం పూర్ణశాంతి గుప్తా

**బాలాపూర్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** శ్రీ పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పును తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ పేరు మార్పు ఆర్యవైశ్యులు మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని స్త్రీ హస్తిన మహిళా మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు డా. ఎర్రం పూర్ణ శాంతి గుప్తా అన్నారు. ఈ మేరకు ఆమె మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. గతంలో ఈ విషయంపై ప్రభుత్వానికి ఆర్యవైశ్యులు అనేక మార్లు విన్నవించుకున్నా, తమ మనోభావాలు దెబ్బతినేలా ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు ఒక్క ఆర్యవైశ్యులకే కాకుండా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆకాంక్షలు నెరవేరడానికి తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా 58రోజులు అకుంఠిత నిరాహార దీక్షను చేసిన మహానుభావుడు అని, స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా వారి పాత్ర ఉందని గుర్తుచేశారు. తెలుగువారికి గుర్తింపు లేని రోజుల్లో తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడి ఆంధ్ర రాష్ట్రం సాధించిన మహనీయుడని, కేవలం అతను ఆంధ్రా ప్రాంతానికి చెందిన వ్యక్తి అని తెలుగు విశ్వవిద్యాలయం పేరు ను మార్చడం తగదని అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి అంటే తమకు కూడా గౌరవమేనని అయితే మహనీయుని పేరు కొత్తగా స్థాపించే విశ్వవిద్యాలయాలకు నామకరణం చేస్తే తమకు అభ్యంతరం లేదని అన్నారు. పొట్టి శ్రీరాములు అంటే తెలుగువారి ప్రతీక అని, హైదరాబాద్ లో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం పొట్టి శ్రీరాములుతో ప్రపంచానికి పరిచయం అని అన్నారు. పేరు మార్పును ఉపసంహరించుకోకుంటే రాష్ట్రంలో అన్ని ఆర్యవైశ్య సంఘాలు ఉద్యమిస్తాయని తెలిపారు. ఆర్యవైశ్యుల ఆగ్రహానికి గురికాక తప్పదని పేర్కొన్నారు.

## ఎస్సై ఉద్యోగం సాధించిన మంజుల రాథోడ్

### అభినందించినమాజీ వైస్ ఎంపీపీ కరుణ



**తాండూరు, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** బషీరాబాద్ మండల పరిధిలోని జీవన్గి గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించి ఎస్సై ఉద్యోగం సాధించిన మంజుల రాథోడ్ ను మాజీ ఎంపీపీ కరుణ, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుదల, అంకిత భావం, క్రమశిక్షణతో చదివి, ప్రభుత్వ ఉద్యోగం సాధించడం గర్వించదగ్గ విషయమని, మంజుల రాథోడ్ తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంజుల రాథోడ్ ను ఆదర్శంగా తీసుకుని మండల పరిధిలోని, విద్యార్థినిలు అందరూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి కృషి చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో చదువుకుని, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారంటే ఇటు తల్లిదండ్రులకు, అటు గురువులకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు తెచ్చిన వారు అవుతారని స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేష్ రాథోడ్, నర్సింలు, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు కోట్ల నగదు, 35 తులాల బంగారం చోరీ





- పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలో ఘటన
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసిపి చక్రపాణి

**పోచారం, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** గుర్తు తెలియని దొంగలు యింట్లోకి చొరబడి రెండున్నర కోట్ల నగదు, బంగారు ఆభరణాలు చోరి చేసిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్ పరిధి మక్త గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున జరిగింది. పోచారం ఐటీసీ పోలీసు స్టేషన్ పరిధిలో సంచలనంగా మారిన చోరి కేసు వివరాలు ఇన్ స్పెక్టర్ రాజువర్మ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. పోచారం ఇటీసీ పోలీసు స్టేషన్ పరిధి మక్త గ్రామంలో బైనగారి నాగభూషణం, పద్మమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. నాగభూషణంకు నారపల్లిలో డేయిరీఫాం ఉంది. అందులో 30కి పైగా పాలిచ్చే గేదేలు, ఆవులు ఉంటాయి. ప్రతి రోజు తెల్లవారు జామున 4 గంటలకు డేయిరీఫాంకు వెళ్లి పాలు సరఫరా చేస్తుంటాడు. కాగ ఇటీవల శంకర్ పల్లి లోని భూమిని అమ్మగా రెండు కోట్ల 2 లక్షలు అడ్వాన్స్ కింద డబ్బులు వచ్చాయి. అట్టి డబ్బులను ఇతరులకు ఇవ్వాల్సి ఉండగా బెడ్ రూమ్ లోని డ్రెసింగ్ టేబుల్ లో బద్రపరిచారు. రోజు వారి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 4 గంటలకు భార్య పద్మమ్మ ఇంట్లో ఉండగా మేయిన్ డోర్ కు గొళ్లెం పెట్టి డేయిరీఫాం కు వెళ్లాడు. అదే అదునుగా భావించిన గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి ప్రవేశించి డ్రెసింగ్ టేబుల్లో ఉన్న రెండు కోట్ల 2 లక్షల నగదు, 35 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగులను చోరీ చేసి తలుపులు వేయకుండానే వెళ్లారు. ఉదయం 6 గంటల తర్వాత లేచిన భార్య పద్మమ్మకు తలుపులు తెరిచి ఉండటంతో బెడ్రూమ్ లోకి వెళ్లి చూడగా డ్రెసింగ్ టేబుల్ తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో ఉన్న బ్యాగులను గమనించగా లేకపోవటంతో భర్త నాగభూషణంకు ఫోన్ చేసి తెలిపింది. చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చిన నాగభూషణం పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, పోచారం ఐటీసీ ఇన్ స్పెక్టర్ రాజువర్మ లు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ లను రప్పించి ఆధారాలు సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. మక్త గ్రామంలో జరిగిన భారీ నగదు, బంగారు నగల చోరీ ఘటనలో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న నాగభూషణం డ్రైవర్ తో పాటు మరి కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ నెల 18న శంకర్ పల్లి లోని భూమి అమ్మగా వచ్చిన డబ్బుల సమాచారం నాగభూషణం డ్రైవర్ రవికి తప్ప ఎవరికి తెలియదని బాధితుడు పోలీసులకు చెప్పటంతో అతనితో పాటు మరి కొంత మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మక్తలో జరిగిన భారీ నగదు, నగలను చోరీ చేసిన దొంగలను త్వరలో పట్టుకుంటామని ఏసీపీ చక్రపాణి తెలిపారు. నగదు కోల్పోయిన నాగభూషణం యిచ్చిన సమాచారం మేరకు విచారణ చేపట్టామని, నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని. తగు ఆధారాలతో దొంగలను పట్టుకుంటామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సంక్షేమ బోర్డు కోసం కేంద్రంపై రవాణా కార్మికులు పోరాడాలి






**ఖమ్మం, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** ఆర్టీసీ సంస్థకు ధీటుగా మారుమూల పల్లెలకు సైతం ప్రజలకు ప్రయాణ సేవలందిస్తున్న ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోవాల్సిన భాద్యత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని,ఆ భాధ్యతను విస్మరించి పన్నులు, ఫైన్ల పేరుతో కార్మికులను దోచుకునే పనిలో పాలకులు ఉన్నారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ ఆటో, క్యాబ్ అండ్ ప్రైవేట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభలు కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్బులో ఆదివారం ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభం సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలం వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి కొత్తగూడెం క్లబ్బు వరకు కార్మికులు తమ ఆటోలు, ప్రైవేట్ వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు ప్రదర్శించిన ఎర్ర జెండాలతో కొత్తగూడెం పట్టణం ఎరుపెక్కింది. క్లబ్ ఆవరణలో ఏఐటీయూసీ జాతీయ నాయకులు వి ఎస్ బోస్ జెండాను ఎగురవేసి మహాసభలను ప్రారంభించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రవాణారంగ కార్మికులను దోచుకోవడమే పనిగా పెట్టుకుందని, రోడ్డు సేఫ్టీ చట్టాలు, అపరాధ రుసుములు, పన్నుల పేరుతో కార్మికుల జేబులు కొల్లగొడుతూ ఖజానా నింపుకుంటోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచు కార్మికులపై భారం మోపుతున్నారని, అన్ని వసతులపై జీఎస్టీ విధిస్తున్న కేంద్రం పెట్రోల్, డీజిలుపై ఎందుకు జీఎస్టీ విదించరో సమాధానం చెప్పాలని, ఈ విధానం ఇంధన కంపెనీలకు మేలు చేసేందుకేనని విమర్శించారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు తరహాలో దేశవ్యాప్తంగా లక్షలాదిగా ఉన్న రవాణారంగ కార్మికుల సంక్షేమ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమిస్తున్నా కేంద్రం పెడచెవిన పెడుతోందని విమర్శించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై తిరగబడితేనే న్యాయం జరుగుతుందని కూనంనేని అన్నారు. ఏఐటీయూసీ అనుబందంగా ఏర్పడిన ఆటోరిక్షా వర్కర్స్ యూనియన్ ఐదు దశాబ్దాలుగా కార్మికుల పక్షాన పోరాడుతోందని, అనేక హక్కులు సాధించిపెట్టింది తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన ఆటో, క్యాబ్ కార్మికులకు ప్రతి నెల రూ.12 వేల ఆర్థికసాయం అయిందించి ఆదుకోవాలని, భీమా సౌకర్యం కల్పించాలని, బీమాను రూ.10 లక్షలకు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రవాణా రంగ కార్మికుల ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడేందుకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఏఐటీయూసీ ఎస్ కె సాబీర్ పాషా, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వి ఎస్ బోస్, ఎస్ బలరాజు, బి.వెంకటేష్, నరాటి ప్రసాద్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. మహాసభలో సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, కె.సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పెరబోయిన మోహన్ రావు, దేవరకొండ శంకర్, వి.పూర్ణచందర్ రావు, జి.రామకృష్ణ, భూక్య దస్రు, కందుల భాస్కర్, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పూజలు



**మేడ్చల్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి లోని కొమురవెల్లి మల్లిఖార్జున స్వామి ని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లి దర్శించుకున్నారు. కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయంలో మల్లారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాకు మల్లన్న దేవుడంటే ఎంతో ఇష్టమని మల్లిఖార్జున స్వామి ని దర్శించుకోవడం చాల సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరు సంతోషంగా ఉండాలని మల్లన్నను కొరుకున్నానని మల్లారెడ్డి తెలిపారు. మల్లన్నను దర్శించుకున్న వారిలో మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు భాగ్య రెడ్డి, ఒగ్గు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి హిల్స్ కాలనీ అధ్యక్షునిగా మధుసూదన్

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ దొంతిరి



**మేడిపల్లి, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్లోని సాయి హిల్స్ కాలనీ అశోషియేషన్ కార్యవర్గన్ని కాలనీ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా యం.మధుసూదన్ ను అధ్యక్షునిగా, పి.మోహన్ రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అనంతరం పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రవి, కిరణ్ కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వేణు, రాజిరెడ్డి, శ్రవణ్ రెడ్డి, కోశాధికారి హరినాథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు భానుప్రకాష్ గౌడ్, సంయుక్త కార్యదర్శి శ్రవణ్ లను నియమించారు. అనంతరం కార్పొరేటర్ కార్యవర్గ సభ్యులను, కమిటీ సభ్యులను, సలహాదారులను శాలువాతో సన్మానించి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. గత కార్యవర్గ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి మధుసూదన్, మహేందర్, కార్యవర్గ కమిటీ సభ్యులను అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ముమ్మరంగా వాహన తనిఖీలు



**నారాయణపేట, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన ఆర్ సి డ్రైవింగ్, లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. వాహనాలకు నెంబర్ ప్లేటు తప్పనిసరిగా వేయించుకోవాలని, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపరాదని లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# రైతు రుణమాఫీపై.. మాట్లాడే అర్హత మాజీ మంత్రికి లేదు

- బిఆర్ఎస్ పాలనలో రుణమాఫీ ఎందుకు చేయలేదు
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పెబ్బేరు, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** రైతురుణ మాఫీపై మాట్లాడే అర్హత మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి లేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.ఎన్నికల ముందు ఎకరానికి 10వేల రూపాయల పరిహారం ఇస్తామని చెప్పి మోసం చేసిన మీలాంటి వాళ్ళు రైతు శ్రేయస్సు గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు.భారాస ప్రభుత్వ పాలనలో రుణమాఫీ ఎందుకు సరిగ్గా చేయలేదో దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షలు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదన్నారు. రైతు రుణమాఫీ కోసం 31 వేల కోట్లు ఖర్చు చేసేందుకు నిర్ణయం తీసుకొని



కేవలం 25 రోజుల్లో 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్లలను ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామన్నారు.కుంటి సాకులు చూపిస్తూ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు ఇకనైనా మాజీ మంత్రి మానుకోవాలన్నారు.ఖరీఫ్ నుంచే అన్నదాతలందరికీ క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని ఆయన అన్నారు.

## ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుంది



### తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** ఇది మంచి ప్రభుత్వమని ప్రజలు అంటున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీలన్ని ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన చెప్పారు. ఎస్టీవి నగర్ లోని శ్రీరాముని భజన మందిరం వద్ద జరిగిన ప్రజావేదికలో 12 నుంచి 17వ డివిజన్ వరకు గల ప్రజలు పాల్గొన్నారు. సూపర్ సిక్స్ అమలుతో ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడం మొదలు పెట్టిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఒకటవ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇవ్వడమే కాకుండా పెన్షనర్లకు పెన్షన్ అందిస్తున్న ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ 17వేల మందితో మెగా డిఎస్సీని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లు ప్రకటించారని ఆయన చెప్పారు. ఐదేళ్ళలో 20లక్షల ఉద్యోగల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ ల నిర్మాణాల వేగవంతానికి, పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం శుభపరిణామమని ఆయన చెప్పారు. ప్రభుత్వం చేసిన మంచి ప్రజలకు ఇది మంచి ప్రభుత్వంలో చెప్పడమే కాక వారి సమస్యలు విని పరిష్కరించిందేంకు ప్రజావేదిక దోహదపడుతోందని ఆయన తెలిపారు. అనంతరం వందరోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిస్తూ కరపత్రాలను స్థానికులకు ఎమ్మెల్యే అందించడంతో పాటు ఇళ్లకు స్టికర్స్ అతికించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పోరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సిఎంఎం కృష్ణవేణి,అర్బన్ తహశిల్దార్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో తలనీలాలు సమర్పించి.. శాంతి యాగంలో పాల్గొనాలి



- తిరుమల శ్రీవారి లడ్డు అపవిత్రంతో అపచారం జరిగితే మఠాధిపతులు, పీఠాధిపతులు ఏం చేస్తున్నారు.
- తిరుమలలో మఠాలు కట్టుకొని వ్యాపారాలు చేస్తున్నారా
- శ్రీవారి లడ్డును కించపరిచేలా మాట్లాడితే నాలుక కోస్తాం: కిరణ్ రాయల్

**తిరుపతి, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** తిరుపతిలో జనసేన నేత కిరణ్ రాయల్ ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. శ్రీవారి చిత్రపటానికి లడ్డు ప్రసాదాన్ని నైవేద్యంగా పెట్టి జనసేన నేతలు హారతులు ఇచ్చారు.ఈ సమవేశం లో కిరణ్ రాయల్ మాట్లాడుతూ తిరుమల లడ్డు ప్రసాదం తిరుపతి వాసులకు, హిందువులైన ప్రతీ ఒక్కరికీ ఎమోషన్ అన్నారు. తిరుమల శ్రీవారి లడ్డు అపవిత్రంతో అపచారం జరిగితే మఠాధిపతులు, పీఠాధిపతులు ఏం చేస్తున్నారాన్నారు. తిరుమలలో మఠాలు కట్టుకొని వ్యాపారం చేయడం పీఠాధిపతుల పని కాదని ఇలాంటి మహా పాపం జరిగినప్పుడు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీవారి లడ్డూలో రూ.500 కోట్ల స్కాం జరిగిందని, వైసీపీ నేతలు తిరుమల పవిత్రతను మంట గలిపారని, ఎన్నికలకు ముందు లడ్డూ వ్యవహారం బయటకు వచ్చి ఉంటే వైసీపీ నే కాదు జగన్ కూడా ఘోరంగా ఓడిపోయి ఉంటాడన్నారు. లడ్డును కించపరిచే విధంగా కొందరు మాట్లాడుతున్నారని, అలా ఎవరైనా మాట్లాడితే నాలుక కోస్తామన్నారు. జగన్మోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి లు తప్పు చేయలేదని భావిస్తే తిరుమలకు వచ్చి తలనీలాలు సమర్పించాలని, తిరుమలలో జరగనున్న శాంతి యాగం లో పాల్గొనాలాన్నారు. లడ్డూ వ్యవహారంలో తప్పు చేసిన వారి అరెస్టులు జరిగేంత వరకు వెనక్కితగ్గే ప్రసక్తే లేదన్నారు. సినీనటుడు ప్రకాష్ రాజ్ నాస్తికుడని, లడ్డు వ్యవహారంలో విచారణ జరిపి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నందుకు వారిని ప్రకాష్ రాజ్ విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. రోజా, పెద్దిరెడ్డి టిక్కెట్ల బాగోతం బయటపడిందని, మంత్రి హోదాలో రోజుకు వెయ్యి టిక్కెట్లను రోజా, పెద్దిరెడ్డి అమ్ముకున్నారని రోజా, పెద్దిరెడ్డిలు జైలుకెళ్ళడం ఖాయమని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో సుమన్ బాబు, మనోజ్, గోపి స్వామి, సుమంత్, శ్రీనివాసులు, సిద్దు, సుధాకర్, శేషాద్రి, భాను, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి లడ్డు అపవిత్రం చేసిన వారిని శిక్షించమ్మా

### బిజెపి నాయకులు టెంకాయలు కొట్టి వేడుకోలు



**తిరుపతి రూరల్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** తిరుపతి రూరల్ మండలంలోని పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి ప్రక్కన పేరూరు వద్దగల శ్రీ వకుళా మాత ఆలయం వద్ద శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యికి పాల్పడిన పాత్రధారులను కఠినంగా శిక్షించాలంటూ రాష్ట్ర బిజెపి కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు,నవీన్ కుమార్ రెడ్డి, పురుషోత్తం నాయుడు,విష్ణువర్ధన్ రెడ్డి, నరేష్ కుమార్ నాయుడు, ప్రేమ్,చిన్నా,రమేష్,ప్రసన్న, మహేష్‌లతో పాటు స్థానిక బిజెపి నాయకులు భక్తులతో కలిసి ఆదివారం టెంకాయలు కొట్టారు.శ్రీవారి లడ్డుని అపవిత్రం చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని అమ్మ వారిని వేడుకున్నారు, ఈ సందర్భంగా రమేష్ నాయుడు నవీన్ కుమార్ రెడ్డి పురుషోత్తం నాయుడులు మాట్లాడుతూ తిరుమల శ్రీవారికి తల్లిగా కొండపైన ఆలయంలో వున్న శ్రీ వకుళా మాత ప్రతినిత్యం అన్న ప్రసాదాల పోటు, సంరక్షకురాలుగా శ్రీ వెంకటేశ్వర స్వామికి తయారు చేసే నైవేద్యాలను అన్నప్రసాదాలను నిరంతరం పర్యవేక్షిస్తుందని చరిత్ర చెబుతుంది అలాంటి అమ్మవారి కళ్ళు కప్పి అపవిత్రమైన నెయ్యి ను వినియోగించి స్వామివారికి నైవేద్యంగా శ్రీవారి భక్తులకు ప్రసాదంగా అందించిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని వేడుకొన్నారు. వైకాపా పాలనలో కమిషన్లకు కక్కుర్తి పడి కోట్లాదిమంది భక్తుల మనోభావాలను ఆలయ పవిత్రతను భ్రష్టు పట్టించిన దుర్మార్గులను వదిలే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం సైతం తిరుమలలో జరిగిన అపవిత్రంపై అందుకు బాధ్యులైన వారిపై త్వరలో కఠిన చర్యలు తీసుకోబోతుందని హెచ్చరించారు దేశ ప్రధాని సైతం తిరుమలలో జరిగిన అపవిత్రతపై ఆవేదన వ్యక్తం చేశారని దోషులను శిక్షించేందుకు త్వరలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వబోతున్నదన్నారు,తిరుమల లడ్డుకు వినియోగించే నెయ్యి లోనే కమిషన్లకు కక్కుర్తి పడ్డ వైకాపా పాలనలోని దుర్మార్గపు అవినీతి అధికారులు,పాలకమండలి చైర్మన్ లు శ్రీ వెంకటేశ్వర స్వామికి శ్రీకృష్ణ దేవరాయల కాలంనాటి నుంచి నేటి వరకు ఎంతో మంది దాతలు రాజులు మహంతులు ఇచ్చిన కానుకలు వజ్ర వైడూర్యాలతో పాటు కోట్లాది రూపాయల బ్యాంకు డిపాజిట్లను కూడా మాయం చేశారా అన్న అనుమానాలు భక్తులలో కలుగుతున్నాయన్నారు. తిరుమల శ్రీవారికి వెలకట్టలేని నగలు బ్యాంకులోని వేలకోట్ల డిపాజిట్లపై దుర్మార్గులు కన్నేశారా,స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకున్నారా అనే పలు అనుమానాలు కోట్లాదిమంది భక్తులకు కలుగుతున్నాయని వెంటనే (సి ఎ జి) సెంట్రల్ ఆడిట్ జనరల్ ద్వారా సమగ్రమైన దర్యాప్తుకు ఆదేశించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు..! వకుళా మాతా మన్నించు తల్లీ తిరుమల పవిత్రతను అపవిత్రం చేసిన దుర్మార్గులను శిక్షించాలి తిరుమల ఆలయ పవిత్రతను కాపాడాలి అంటూ నినాదాలు చేసి పాపపరిహారార్థం టెంకాయలు కొట్టి అమ్మవారిని వేడుకున్నారు.

## వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు కృషి: పిట్ల

### ధన్యవాదాలు తెలిపిన మల్లికార్జున గుట్ట వాసులు





**కుత్బుల్లాపూర్, 22 సెప్టెంబర్ (నిఘా న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం జీడిమెట్ల మల్లికార్జున గుట్టలో వడ్డె ఓబన్న విగ్రహానికి తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేయిస్తానని తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా నియమితులైన పీట్ల మల్లేష్ హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మల్లికార్జున గుట్ట వాసులు. ఆదివారం జీడిమెట్ల మల్లికార్జున గుట్టకు చెందిన వల్లెపు శ్రీను అలకుంట్ల హనుమయ్య ముదంగుల హనుమంతు గోదెండ్ల పరమేష్ వల్లెపు యాదయ్య రేపని ఎల్లయ్య తదితరులు తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ లో రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా పీట్ల మల్లేష్ ఎన్నికైన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మల్లికార్జున గుట్టలో వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయాలని అనుకుంటున్నామని వారికి వివరించగా వెంటనే స్పందించి వడ్డే ఓబన్న విగ్రహం తాను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తరి గణేష్ తో కలిసి రాజేంద్ర నగర్ వేముల శ్రీనుని కలిసి సంఘం విషయాలపై చర్చించారు. ఓబన్న విగ్రహాన్ని తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చిన పిట్ల మల్లేష్ కు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక వడ్డెర సంఘం నాయకులు తమ ప్రాంతంలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటుకు కృషి చేయాలని వడ్డెర్ల కోసం తెలియని వారి కూడా తెలిసే అవకాశం ఉందని, ప్రతి వడ్డెర నాయకులు ఈ విషయంపై స్పందించాలని ఓబన్న విగ్రహం కోసం ప్రయత్నాలు చేయాలని కోరుకుంటున్నామని తెలిపారు.

# నేటి నుంచి బొడ్డెమ్మ పండుగ ప్రారంభం

- స్త్రీలందరూ డప్పు చప్పుడుతో వెళ్లి పవిత్రమైన పుట్ట మన్ను తెచ్చే విధానము.
- బొడ్డెమ్మ పాటలతో తెలంగాణ ఆడబిడ్డల సందడి



**వరంగల్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలోని 42 వ డివిజన్ లో గల రంగసాయిపేట కరీమాబాద్ ఉరుసు కిలా వరంగల్ శివనగర్ తదితర ప్రాంతాలలో సోమవారం బొడ్డెమ్మ పండుగ ప్రారంభం రంగసాయిపేట 42వ డివిజన్ ఆదర్శనగర్ లోని చీకటి సరోజన నివాసంలో గత పది సంవత్సరాల నుండి బొడ్డెమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. చీకటి సరోజన మాట్లాడుతూ బొడ్డెమ్మ పండుగ మా ఇంటిలో నిర్వహిస్తున్న నాటి నుంచి మాకు బొడ్డెమ్మ కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబాలకు అంతా మంచే జరుగుతుందని వారు తెలిపారు. బొడ్డెమ్మను తయారు చేసే విధానము బొడ్డెమ్మ అనే పదాన్ని అమ్మవారి నామాలతో ఒక నామంగా గుర్తించి బొడ్డెమ్మను పుట్టమన్నుతో తయారుచేస్తారు. ఎవరు కాలు మోపని ప్రాంతానికి చెందిన మట్టి పుట్ట మన్నును తెచ్చి పీటపై శ్రీ చక్ర రూపంలో గడులతో తయారుచేసి కింది నుంచి వెడల్పు మీదికి కలశ రూపంలో బొడ్డెమ్మను తయారు చేస్తారు. బొడ్డెమ్మను ఆడే స్థలంలో ఎర్రమన్నుతో అందంగా అలికి పిండి ముగ్గులు పసుపు బొట్లు కుంకుమ బొట్లు పెట్టి వివిధ పూల తో అలంకరిస్తారు. అగర్బత్తులు ముట్టించి ఆడపడుచులు చిన్నారులు ఆట పాటలతో పూజలు నిర్వహిస్తారు. బొడ్డెమ్మ పండుగలో పాల్గొనే ఆడపడుచులు ప్రతి రోజు సాయంత్రం ఇంటి నుంచి బియ్యము అటుకులు చక్కర బెల్లం కలశంలో పోసి ఆటపాట జరుపుతారు. అనంతరం వారి వెంట తీసుకొచ్చిన ప్రసాదం ను పంచుతారు ఇదేవిధంగా తొమ్మిది రోజులు జరుపుతారు. తొమ్మిదో రోజు నిమజ్జనం తొమ్మిది రోజులపాటు ఆడపడుచులు ఆటపాటలతో బొడ్డెమ్మను భక్తిశ్రద్ధలతో పూజించి తాము తెచ్చిన బియ్యం బెల్లం రొట్టెలు చపాతితో కలిపి లడ్డులు తయారు చేసి అందరికీ ప్రసాదంగా పంచుతారు. ఆటపాట అనంతరం పెళ్లి రావమ్మా బొడ్డెమ్మ అంటూ చెరువులో బావులలో బొడ్డేమ్మను నిమజ్జనం చేస్తామని శంకేసి చిన్న రమాదేవి తెలిపారు. ప్రతిరోజు ఆడపడుచులు అలంకరించిన తర్వాత బొడ్డెమ్మ పాటలు ఆడపడుచులు పాడుతూ బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్, బిడ్డలేందరు కోల్ నీ బిడ్డ నీల గౌరుకోల్ నిత్యమల్లె చెట్టేసి కోల్ నిత్యమల్లె చెట్టుకు కోల్ నిత్య నీళ్ల పోసిక్కోల్, దాని ఆకు పలుచానా కోల్, దాని నీడ చల్లన కోల్, దాని పూత పూసింది కోల్ కమ్మటి వాసనలో కోల్, దాని కాత కాసింది కోల్, బుక్క వాసనలో కోల్, కాయలు పిందలు కోల్, గనమైన కాయాలు కోల్, కాయలన్నీ కోసి కోల్, కడవల్లో పోసి కోల్ పిందేలన్ని కోసి కోల్, బిందెలలో పోసి కోల్ పండ్లన్ని కోసి కోల్, బిందెలల్లో పోసి కోలకోల్, పండ్ల నీ కోసి కోల్ బండ్ల నింపి కాల్, పోయనే ఆబండి కోల్, కొమురవెల్లి దాకా కోల్, కొమురెల్లి మల్లన్న కోల్, పండ్లమ్మ పండ్లు కోల్ ఏమి పండ్లు గాని కోల్ ,ఎంత ఘుమ ఘుములో కోల్, చూసే వారే గాని కోల్, కొనే వారు



లేరుకోల్, పోయనే ఆ బండి కాల్, వేముల వాడ దాకా కోల్ వేములవాడ రాజన్న కోల్. పండ్లు ఈ పండ్లు కోల్, ఏమి పండ్లు గాని కోల్, ఎంత గుమగుమలో కోల్, బొంగరాలు ఆడేటి కోల్, బాలురు కోనరమ్మకోల్, బొడ్డెమ్మ ఆడేటి కోల్, బాలికలు కోనరమ్మ కోల్, చుసే వారే గానీ కోల్, కొనేవారు లేరు కోల్, ఆ నుండి ఆ బండ్లు కోల్, మేడారం దాకా కోల్, మేడారం సమ్మక్క సారలమ్మ కోల్, పండ్లు పండ్లు కోల్, ఏమి పండ్లు గాని కోల్ ఎంత ఘుమ ఘుమలో కోల్ చూసే వారే గాని కోల్, కొనే వారు లేరు కొల్ అంటూ బొడ్డెమ్మ పాటలు మహిళా యువతులు పాడుతారు. ఈ బొడ్డెమ్మ తొమ్మిది రోజులపాటు జరుగుతుంది ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుండి 8 గంటల వరకు బొడ్డెమ్మ ఆటపాటలతో ఆడపడుచులు ఆడుతారు. అనంతరం బొడ్డెమ్మను నిద్ర పుచ్చుట కార్యక్రమం చేస్తారు. బొడ్డెమ్మను నిద్రపుచ్చుట నిద్రపో బొడ్డెమ్మ నిద్రపోవమ్మ, నిద్రకు నూరేళ్లు నీకు వేయి ఏండ్లు, పాలిచ్చే తల్లికి బ్రహ్మ వేయి ఏండ్లు, నిన్ను కన్న తల్లికి నిండు నూరేళ్లు, నిద్రపో బడ్డెమ్మ నిద్రపోవమ్మా అంటూ నిద్రపుచ్చారు.



ఢిల్లీలో ఆదివారం కేంద్ర హెూం శాఖ సెక్రటరీ గోవిందుమోహన్ ను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాద పూర్వకంగా కలిసి శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల ఫోటో, అభిషేకం లడ్డు అందించారు. శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్ల ప్రసాదం అందించిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని కేంద్ర హెూం శాఖ సెక్రటరీ గోవింద్ మోహన్ అభినందించారు. కేంద్ర హెూం శాఖలో ఆంధ్రప్రదేశ్ కు సంబందించిన పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేసేందుకు సహకరించాలని కేంద్ర హెూం సెక్రటరీ ని ఎంపీ బైరెడ్డి శబరి కోరారు.

- నంద్యాల, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):

# అక్రమ నిర్మాణాలకు...
# రాజకీయ దళారుల దర్శకత్వం

## అడ్డు అదుపు లేని అక్రమ నిర్మాణాలు



**కాప్రా, సెప్టెంబర్ 21 (నిఘా న్యూస్):** కాప్రా జీహెచ్ఎంసి పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేదు. సర్కిల్ పరిధిలో ఎక్కడ చూసినా టౌన్ ప్లానింగ్ నిబంధనలు ఉల్లంగిస్తూ చేస్తున్న నిర్మాణాలే కనిపిస్తాయి. తీసుకున్న అనుమతులకు చేస్తున్న నిర్మాణాలకు సంబంధమే ఉండదు. జీహెచ్ఎంసీ నుండి పొందేది రెసిడెన్షియల్ పర్మిషన్ కట్టేది మాత్రం కమర్షియల్ భవనాలు. రోడ్డు వైడింగ్ లు, సెట్ బ్యాక్స్, డీవియేషన్స్ మాస్టర్ ప్లాన్ నిబంధలు పాటించకుండా జరిగుతున్న నిర్మాణాలే ఎక్కువగా దర్శనమిస్తాయి. నగరంలో పెరుగుతున్న జనాబా పెరిగి కాలనీలు వ్యాపార సముదాయాలు విస్తరిస్తున్నాయి. అందుకు అనుగుణంగా ప్రభుత్వ తీసుకొచ్చిన చట్టాలను ఉల్లంగిస్తూ జరుగుతున్న నిర్మాణాలతో బౌషత్ ప్రజలకు అవస్థలు, అంధకార పరిస్థితులు తప్పవని నిపుణుపులు హెచ్చరిస్తున్నారు.

### ఉల్లంఘన వెనుక రాజకీయ దళారులు

ఎక్కడ అక్రమం జరుగుతున్నా దాని వెనుక రాజకీయ, ప్రజా నాయకుల పాత్ర ఉంటుంది. చేపట్టే నిర్మాణ స్థాయిని బట్టి భవన యజమాని, బిల్డర్లు ఏరియా లీడర్లను కలిసి తగిన ముదుపులు చెల్లిస్తారు. ఇక అంతా తామై చూసుకుంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నది ప్రజా నాయకులు, రాజకీయ దళారులే. అభివృద్ధి వైపు నడిపించాల్సిన వారు అక్రమ సంపాదన కోసం అంధకారంలోకి నెడుతున్నారనే విమర్శలు ఇక్కడి ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

### అక్రమార్కుల సేవలో టౌన్ ప్లానింగ్

ప్రభుత్వ నుండి జీతాలు పొందుతూ ప్రజలకు సేవలు చేయాల్సిన వారు దళారులకు, అక్రమార్కులకు అందుబాటులో ఉంటూ సేవల్లో తరిస్తున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ నిర్మాణాలపై ఇక్కడి అధికారులు ఎక్కడ పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అక్రమ నిర్మాణాలపై పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నా వీరికి దున్న పోతుపై వాన చినుకు మాదిరిగా ఉంటది తప్ప పెద్దగా పట్టింపు ఉండదనేది ఇక్కడి అధికారులపై ప్రజల అభిప్రాయం. సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ బహుళ అంతస్థుల నిర్మాణాలపై ఉన్నత స్థాయి అధికారులు పట్టించుకోని వీటి వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని పలు కాలనీలకు చెందిన అభివృద్ధి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.



# కాకినాడ రూరల్ ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయండి

### రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్ డిమాండ్



**గోకవరం, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** కాకినాడ రంగరాయ వైద్య కళాశాల హెచ్ ఓ డి వైస్ ప్రిన్సిపల్ ఉమా మహేశ్వరరావుపై పంతం నానాజీ అనుచరుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఒరేయ్ నిన్ను చంపేస్తాను రా అని తిట్టి కొట్టి మాస్క్ లాగివేసి, అతని అనుచరులు దౌర్జన్యం చేసి కొడుతుంటే చోద్యం చూసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అతనిని ఎమ్మెల్యే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని ఆ విధంగా చేయక పోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని పిట్టా వరప్రసాద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# సుప్రభాత్ హెూటల్‌లో దారుణం

### సాంబార్‌లో ప్లాస్టిక్ వైర్లు ప్రత్యక్షం స్పందించని ఫుడ్ సేఫ్టీ అధికారులు



**హబ్సిగూడ, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** హబ్సిగూడ చౌరస్తాలో గల సుప్రభాత్ హెూటల్‌లో ఆదివారం ఉదయం దారుణం జరిగింది. ఉప్పల్ చెందిన ప్రైవేటు పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు ఉదయం టిఫిన్ చేద్దామని ఇడ్లీ ఆర్డర్ చేయగా పొడుగాటి ప్లాస్టిక్ తాడు సాంబార్లో ప్రత్యక్షమైంది. ఇదేమిటని హెూటల్ నిర్వాహకులను కస్టమర్లు ప్రశ్నించగా నిర్లక్ష్యపు సమాధానం చెబుతూ దాటవేశారు. హెూటల్ యజమాని పట్టించుకోకుండా బిల్లు కట్టి వెళ్ళండి అని కస్టమర్లపై దురుసుగా ప్రవర్తించాడు. దీనిపై ఉప్పల్ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదు. ఉప్పల్, హబ్సిగూడ, రామంతపూర్ ఎక్కడో ఒకచోట ఇలాంటి దారుణాలు జరుగుతూనే ఉన్న ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వివరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో హబ్సిగూడలోని స్వాతి టిఫిన్స్ సెంటర్లో సాంబార్లో బొద్దింక వచ్చినప్పుడు ఫుడ్ సేఫ్టీ, ఉప్పల్ మున్సిపల్ అధికారులు కేవలం 1000 రూపాయల జరిమానా విధించి వదిలేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తక్షణమే హబ్సిగూడ చౌరస్తాలో ఉన్న సుప్రభాత్ హెూటల్ ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సీజ్ చేయాలని కోరారు.

# ఉప్పల్‌లో పేకాటరాయుళ్ల అరెస్ట్



**ఉప్పల్, సెప్టెంబర్ 22(నిఘా న్యూస్):** ఉప్పల్ శ్రీనివాస్ నగర్‌లో పేకాట శిబిరంపై దాడి చేసి 12 మంది పేకాట రాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 13 స్మార్ట్ ఫోన్లతో పాటు రూ.44130 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం శ్రీనివాస్ నగర్‌లో పేకాడుతున్న గంజి కోటేష్, ఎం.ప్రవీణ్ కుమార్, ఏ శ్రీకాంత్ రెడ్డి బి.మారుతి, వై.ప్రభాకర్ జి.రామకృష్ణ,కే శ్రీకాంత్, జి రామకృష్ణారెడ్డి, బి నాయుడు టి నవీన్ కుమార్, వై నాగేంద్ర నరేంద్ర నాయుడు లను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రాజీవ్ ముందు చూపే భారత్‌కు శ్రీరామరక్ష

### ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద రాజీవ్ విగ్రహానికి భూమి పూజ
### త్వరలో ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రారంభం
### రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి విశ్వనాధన్



**ఉప్పల్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** దేశంలో నేడు అమలయ్యే సంస్కరణలన్నీ కూడా నాడు ప్రధానిగా రాజీవ్‌గాంధీ హయాంలో తీసుకొచ్చిన వేనని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాధన్ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ గొప్ప విజనరీగా గుర్తు చేశారు. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద మాజీ ఎంపీ వి.హన్మంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రాజీవ్‌గాంధీ విగ్రహ పరిశీలన, పూజా కార్యక్రమం జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి విశ్వనాధన్ విచ్చేసి రాజీవ్ విగ్రహం వద్ద టెంకాయ కొట్టి పార్టీ నాయకుల, మీడియాతో మాట్లాడారు. దేశంలో రాజీవ్ గాంధీ అంటేనే ఐటీ ఆరాధ్యుడిగా పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించారు. నేడు దేశంలో అమలవుతున్న ప్రతిది కూడా రాజీవ్‌గాంధీ హయాంలోనే తీసుకొచ్చారని గుర్తు చేశారు. అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల హర్షం చేశారు. అతి త్వరలోనే ప్రియాంకగాంధీ చేతుల మీదుగా రాజీవ్ విగ్రహాన్ని ప్రారంభించనున్నట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వి.హన్మంతరావు, ప్రభుత్వ సలహాదారులు (క్రీడలు) జితేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు హరి వర్ధన్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి,శాప్ చైర్మన్ శివసేనారెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్‌సి సెల్, బీసీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బడంగ్ పేటలో... వైఎస్ జగన్ దిష్టిబొమ్మ దహనం

### శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన వారిని శిక్షించాలని డిమాండ్



**బాలాపూర్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో అపవిత్ర పదార్థాలు కలిపి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి లడ్డూ అపవిత్రం చేశారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బడంగ్ పేట్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ లో గత ప్రభుత్వ పాలనలో తిరుపతి ప్రతిష్ట మంట కలిసి విధంగా చర్యలు చేపట్టారని, పరమ పవిత్రమైన వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ పదార్థాలతో తయారు చేసి భక్తులకు అందచేశారని, హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి హయాంలో సుమారు 3 వందల హిందూ దేవాలయాలను ధ్వంసం చేశారని అన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరుని ప్రసాదాన్ని కల్తీ పదార్థాలతో తయారు చేసిన వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షలు పడే విధంగా చూడాలని, హిందూ దేవీ దేవతలను కించపరిచే విధంగా చేసేవారిని వదిలి పెట్టమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నడికుడ యాదగిరి, సామ సంజీవ రెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు గుర్రం మల్లారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్ రెడ్డి, లోకం, బెల్ల రాజు, రుద్ర నర్సింగ్ రావు, మంత్రి మహేష్, చిత్రం శ్రీనివాస్, నిమ్మల రవికాంత్ గౌడ్, సైదులు, బంగారు సురేష్, శివారెడ్డి, అంజి, శశిధర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, పవన్, హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనంలో...
# పోలీసులకు మాంసాహార భోజనం




### హైదరాబాద్ సిపి ఆదేశాలు బేఖాతర్ మటన్, చికెన్‌తో భోజనం

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** ఈనెల 17,18 తేదీల్లో హైదరాబాద్ నగరంలో జరిగిన సామూహిక వినాయక నిమజ్జనం సందర్భంగా కొంతమంది స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సిబ్బందికి మాంసాహార భోజనాన్ని సరఫరా చేయడం వివాదాస్పదంగా మారింది. ప్రతి ఏడాది హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ఉదయం అల్పాహారాన్ని, రాత్రి శాకాహార భోజనాన్ని అందించడం పరిపాటి. ఈ ఏడాది కూడా వినాయక నిమజ్జనం సందర్భంగా ఒక్కో సిబ్బందికి రూ.200 చొప్పున ఉదయం అల్పాహారాన్ని, మధ్యాహ్నం, రాత్రి శాకాహార భోజనాన్ని అందించాలని నగర సిపి సివి ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. 17వ తేదీన జరిగే నిమజ్జనం సందర్భంగా ఉదయం అల్పాహారంగా 2 ఇడ్లీ, ఒక వడ, మధ్యాహ్నం వెజిటేబుల్ బిర్యానీ, రాత్రి సాంబార్ రైస్, 18వ తేదీన ఉదయం ఉప్మా లేదా టమాటా బాత్, మధ్యాహ్నం బగారా రైస్, రాత్రి సాంబార్ రైస్ సిబ్బందికి ఇవ్వాలని సిపి ఆదేశాలు జారీ చేశారు. అయితే హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కొంతమంది ఎస్ హెచ్ ఓ లు నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందికి శాకాహార భోజనం కాకుండా, మాంసాహార భోజనాన్ని అందించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ ఏరియాలోని హెూటల్ యజమానుల ద్వారా ఉచితంగా ఉదయం అల్పాహారాన్ని, రెండు పూటలా మటన్, చికెన్‌తో సిబ్బందికి భోజనాన్ని సరఫరా చేసినట్లు తెలిసింది. తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించే వినాయక నవరాత్రులు, నిమజ్జనం సందర్భంగా కొంతమంది ఎస్ హెచ్ ఓలు శాకాహార భోజనం కాకుండా మాంసాహార భోజనాన్ని సిబ్బందికి అందించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈస్ట్ జోన్ లోని ఓ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ తమ సిబ్బందికి మధ్యాహ్నం రాత్రి చికెన్, మటన్‌తో భోజనాన్ని సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది సిబ్బంది వినాయక నిమజ్జనం సందర్భంగా మాంసాహార భోజనం తినడం ఇష్టం లేక బయట హెూటల్ లో డబ్బులు పెట్టి తిన్నట్లు తెలిసింది.

# ముగిసిన సౌత్ జోన్ ఫిజీషియన్ల సదస్సు



**విశాఖపట్నం, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** మూడు రోజులపాటు విశాఖ కేంద్రంగా నిర్వహించిన సౌత్ జోన్ అండ్ సౌత్ జోనల్ అసోసియేషన్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ వార్షిక సదస్సు ఆదివారం ముగిసింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ 1200 మంది ఫిజీషియన్స్ సదస్సులో పాల్గొని విజయవంతం చేశారన్నారు.దేశంలోని 67 మంది వైద్య నిపుణులు సదస్సులో ప్రసంగించారు.

# మానవ హక్కులపై... కౌన్సిల్ సభ్యులు సమీక్ష



**అనకాపల్లి, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన మానవ హక్కుల కౌన్సిల్ సభ్యుల సమీక్ష సమావేశం ఆదివారం అనకాపల్లిలోని జార్జి క్లబ్ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి జిల్లాలోని మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులందరూ హాజరయ్యారు. మానవ హక్కుల సంఘం సమాజంలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల పై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా సమావేశాలు ఏర్పాటు చేయాలని, బాధింపబడిన మహిళలకు చేయూతగా ఉండాలన్నారు.

# వారాహి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

### తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి, సెప్టెంబర్ 22 (నిఘా న్యూస్):** వారాహి మహారథ యాత్రను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఆదివారం ఉదయం జీలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం వారాహి అమ్మవారికి ఆదివరాహి శక్తిపీఠం మహారుద్ర వారాహి స్వామి పూజలు చేశారు. పూజలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని కొబ్బరి కాయ కొట్టి యాత్రను ప్రారంభించారు. వారాహి అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రథ యాత్ర లో భక్తులు పాల్గొని ఆమె కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని చూస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లపై వారాహి అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలనీ కోరుకున్నట్లు ఆయన చెప్పారు. వారాహి మహా రథ యాత్ర ను ఆదివారాహి శక్తి పీఠం, త్రిశక్తి వారాహి శక్తి పీఠం సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి,టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మబ్బు దేవ నారాయణ రెడ్డి, కార్పొరేటర్ అన్నా అనితా, బిజి కృష్ణ యాదవ్, బాల, జనసేన నాయకులు భాను చౌదరి, గోపి రాయల్, చెన్నారెడ్డి కాలనీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com